# విశాల భారతి

తెలుగు దినపత్రిక

24-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 79




## యుద్ధానికి బ్రేక్

- ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు 5 రోజులు వాయిదా
- దౌత్య మంతనాలు సక్సెస్ అవుతాయన్న ఆశతో గడువు
- ఇరాన్ లొంగిపోవడానికి ఇచ్చిన ఆఖరి 120 గంటలు
- సరిహద్దుల్లో భారీగా మోహరించిన అమెరికా, ఇరాన్ సైన్యాలు
- యుద్ధం వస్తే క్రూడాయిల్ ధరలు పెరిగి ప్రపంచ సంక్షోభం
- చమురు ధరల వల్ల మన దేశంలో పెరగనున్న ద్రవ్యోల్బణం

03

# విశ్వనగరంగా హైదరాబాద్

## మూసీ వాసులందరికీ మెరుగైన ఇళ్లు, పునరావాసం కల్పిస్తాం

- మురికి నీటి కష్టాల నుండి నల్గొండ రైతులను కాపాడుతాం
- సలహాల కోసం భట్టి నేతృత్వంలో సబ్ కమిటీ ఏర్పాటు
- హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం
- ఢిల్లీ, ముంబై లాంటి కష్టాలు రాకుండా ముందస్తు చర్యలు.
- ఇది రాజకీయ నిర్ణయం కాదు, తెలంగాణ భవిష్యత్తు యజ్ఞం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మూసీ ప్రక్షాళన అనేది కేవలం ఒక నది శుద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, ఇది లక్షలాది మంది ప్రజల జీవన ప్రమాణాలను మార్చే ఒక బృహత్తర యజ్ఞమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూపొందించిన ప్రణాళికలను విపక్ష సభ్యులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఇచ్చే ఎలాంటి సలహాలనైనా, సూచనలనైనా స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిర్మాణాత్మకమైన విమర్శలు చేస్తే వాటిని పరిగణనలోకి తీసుకుని, అవసరమైతే ప్రాజెక్టు అమలులో మార్పులు చేస్తామని, అంతిమంగా ప్రజల బాధ్యతను తాము భుజాన వేసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ రూపొందించిన

మిగతా 3లో..

హైదరాబాద్ మహానగర గుండెకాయ వంటి మూసీ నది ప్రక్షాళన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో అడుగులు వేస్తోంది. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న సామాన్య ప్రజలెవరినీ నిరాశ్రయులను చేయబోమని, ప్రతి ఒక్కరికీ భరోసా కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. శాసనమండలి వేదికగా ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన సందేహాలకు ఆయన సుదీర్ఘంగా, లోతైన వివరణ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క కుటుంబానికి నష్టం జరగకుండా, ప్రస్తుతం ఉన్నదాని కంటే మెరుగైన వసతులతో కూడిన పునరావాసాన్ని కల్పించే పూర్తి బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు.



## ఎమ్మెల్యే దానం కేసు యూటర్న్

- ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టు కీలక నోటీసులు ఇచ్చింది
- బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఫిర్యాదుతో చిక్కులు మొదలయ్యాయి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయడంపై ప్రశ్నలు
- నామినేషన్ వేసిన నాటి నుంచే అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్
- గతంలో స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చినా, తాజా పిటిషన్ అగ్నిపరీక్షగా మారింది
- ఒక పార్టీ ఎమ్మెల్యేగా ఉండి మరో పార్టీలో ఎలా పోటీ చేస్తారని కోర్టు ప్రశ్నించింది



04



## ప్రభుత్వంది భస్మాసుర హస్తం

- రైతాంగంపై రేవంత్ సర్కార్ భస్మాసుర హస్తం పెడుతోంది
- రైతు భరోసా, రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలమైంది
- రూ.15 వేలు హామీ ఇచ్చి బడ్జెట్‌లో రూ.12 వేలే ఇచ్చారు
- రూ.19 వేల కోట్ల రైతు బంధు నిధులను నిలిపివేశారు
- రుణమాఫీ పూర్తి కాలేదని క్షేత్రస్థాయిలో రైతులు చెబుతున్నారు
- నాట్ల సమయంలో ఇవ్వాల్సిన భరోసాను కోతలప్పుడు ఇస్తున్నారు

03

## ట్రంప్ భయపడ్డారు

- ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేసిన ట్రంప్
- ఇరాన్ ప్రతినిధులతో చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయని వెల్లడి
- చర్చల వార్తలను కొట్టిపారేసిన ఇరాన్,అమెరికా 'మైండ్ గేమ్' అని స్పష్టీకరణ
- తాము యుద్ధాన్ని ఆపలేదని, దాడులు కొనసాగిస్తామని ప్రకటన
- హోర్ముజ్ జలసంధి మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా పెరిగిన చమురు ధరలు
- దాడి జరిగితే శత్రువుల చమురు వనరులను ధ్వంసం చేస్తామని ఇరాన్ హెచ్చరిక

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌లోని కీలక ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులు చేసే ప్రణాళికను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని తన సైనిక దళాలను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. గత రెండు రోజులుగా ఇరాన్ ప్రతినిధులతో జరుగుతున్న చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ పేర్కొన్నారు. ఈ పరిణామం అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు

మిగతా 2లో..




## కోమటిరెడ్డి బ్రదర్స్ వర్సెస్ సీఎం రేవంత్

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గద్దర్ అవార్డుల వేడుకకు రాలేదు
- తన శాఖలో ప్రాధాన్యత లేదని మంత్రి మనస్తాపం
- మంత్రి పదవి నుండి తనను తప్పించాలని కోరినట్లు సమాచారం
- జగ్గారెడ్డికి పీసీసీ పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి డిమాండ్
- రాజగోపాల్ రెడ్డి పదవి కోసం వెంకటరెడ్డి త్యాగం చేయొచ్చు
- పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఊరుకోనని సీఎం పరోక్ష హెచ్చరిక







**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మొట్టమొదటి 'గద్దర్ అవార్డుల' ప్రధానోత్సవ వేడుక ఘనంగా ముగిసినప్పటికీ, ఆ కార్యక్రమం సృష్టించిన రాజకీయ ప్రకంపనలు మాత్రం ఇంకా తగ్గలేదు. ప్రజా యుద్ధనౌక గద్దర్ స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ భారీ వేడుకకు చిత్ర పరిశ్రమలోని ప్రముఖులంతా తరలివచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై అవార్డులు ప్రదానం చేయడంతో అంతా సజావుగా సాగిందని భావిస్తున్న తరుణంలో, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గైర్హాజరీ ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. సినిమా రంగానికి సంబంధించిన ఇంతటి కీలక కార్యక్రమంలో ఆ శాఖా మంత్రి కనపడకపోవడం వెనుక పెద్ద రాజకీయ గూడార్థమే ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అంతర్గత విభేదాలకు పెట్టింది పేరు అనే ముద్ర ఉంది. ఈ సంస్కృతి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా పొరుగున ఉన్న కర్ణాటకలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను మార్చి, డీకే శివకుమార్‌కు పగ్గాలు అప్పగించాలనే డిమాండ్లు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి. అదే తరహాలో తెలంగాణలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కోమటిరెడ్డి సోదరులకు మధ్య ఉన్న దూరం ఇప్పుడు బహిర్గతమవుతోంది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి తమ ప్రాధాన్యత విషయంలో కోమటిరెడ్డి సోదరులు అసంతృప్తితో ఉన్నారన్నది బహిరంగ రహస్యం. ఈ క్రమంలోనే గద్దర్ అవార్డుల వేడుకకు వెంకటరెడ్డి గైర్హాజరు కావడం ఆ అసంతృప్తికి పరాకాష్టగా కనిపిస్తోంది. రాజకీయంగా కూడా కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా సీనియర్ నేత జగ్గారెడ్డిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని ఆయన బాహాటంగా డిమాండ్ చేయడం పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. జగ్గారెడ్డి పగ్గాలు చేపడితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 100 శాతం సీట్లు గెలుచుకుంటుందని వెంకటరెడ్డి జోస్యం చెప్పడం విశేషం. అయితే, ఈ వ్యాఖ్యలు పార్టీలోని బీసీ నేతలకు ఏమాత్రం రుచించడం లేదు. సామాజిక సమీకరణల దృష్ట్యా కీలకమైన ఈ పదవి విషయంలో వెంకటరెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇది పార్టీలో కొత్త వర్గపోరుకు దారితీసేలా కనిపిస్తోంది. మరోవైపు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రిగా తనను తప్పించాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధిష్టానాన్ని కోరినట్లు తెలుస్తోంది. టాలీవుడ్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలను, చర్చలను ముఖ్యమంత్రే నేరుగా పర్యవేక్షిస్తుండటంతో, తన శాఖలో తనకు ప్రాధాన్యత లేదని ఆయన భావిస్తున్నారు. మంత్రిగా ఉండి కూడా సినిమా రంగ పెద్దలతో జరిగే చర్చల్లో భాగస్వామిని చేయకపోవడంపై ఆయన తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. తన సంతకం లేని, తన ప్రమేయం లేని శాఖలో కొనసాగడం కంటే దాన్ని వదులుకోవడమే మేలని ఆయన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు వార్తలు వస్తున్నాయి.

మిగతా 2లో..

## కాంగ్రెస్ నెక్స్ట్ సీఎం బీసీనే..!



- భవిష్యత్తులో కాంగ్రెస్ నుండి బీసీ నాయకుడే సీఎం
- బీసీని సీఎం చేస్తానని కేసీఆర్ చెప్పగలరా?
- బీజేపీ నేతలు బీసీ వ్యతిరేకులని ఆరోపణ
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చట్టం చేశాం
- అందరికీ సన్నబియ్యం ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయం
- గత బీఆర్ఎస్ పాలనలో బియ్యం కుంభకోణం జరిగింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సామాజిక సమీకరణాల చర్చ ఊపందుకుంది. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం, రాజకీయ

మిగతా 3లో..




03

## బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు అరెస్టు

- కాంగ్రెస్ పాలనకు వ్యతిరేక నిరసనలో పోలీసులు, బీజేపీ మధ్య తోపులాట
- పోలీసుల కళ్లుగప్పి ఆటోలో అసెంబ్లీ గేటుకు చేరిన రాంచందర్ రావు
- నిరసన తెలిపిన బీజేపీ అధ్యక్షుడితో పాటు వందలాది కార్యకర్తల అరెస్టు
- ఆరు గ్యారంటీలు ఏవని, రేవంత్ సర్కార్ ప్రజలను వంచించిందని విమర్శ
- 2000 మంది పదే పదే ముట్టడికి యత్నించడంతో పోలీసుల అయోమయం
- ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టీకరణ

## భారతీయుల భద్రతే మా తొలి ప్రాధాన్యం

- యుద్ధం వల్ల గ్లోబల్ ఎకానమీ, రవాణా దెబ్బతిన్నాయి
- చమురు దిగుమతి దేశాల సంఖ్యను 27 నుండి 41కి పెంచాము
- 3.75 లక్షల మందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చాము
- ఎమర్జెన్సీ కోసం పెట్రోలియం నిల్వలను పెంచుతున్నాము
- గల్ఫ్ దేశాల్లో 10, 12 తరగతి పరీక్షలను రద్దు చేశాము.
- అల్లర్లు చేసే శక్తులపై నిఘా ఉంచాలని ఏజెన్సీలను ఆదేశించాము

02



# కోమటిరెడ్డి బ్రదర్స్ వర్సెస్ సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

దీనికి తోడు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కాలనే ఒత్తిడి కూడా వెంకటరెడ్డిపై పెరుగుతోంది. ఇంట్లో ఇద్దరికి పదవులు రావడం కష్టమని భావిస్తున్న తరుణంలో, తన సోదరుడి కోసం తన పదవిని త్యాగం చేసే ఆలోచనలో కూడా ఆయన ఉండవచ్చు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉన్నారు. పార్టీలో ఎంతటి సీనియర్ నాయకుడైనా సరే, క్రమశిక్షణే పరమావధి అని ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వివాదాలకు కేంద్రబిందువుగా మారే నాయకులను పక్కన పెట్టేందుకు కూడా ఆయన వెనుకాడబోరని పార్టీ వర్గాలు అంటున్నాయి.

ప్రస్తుతానికి బయటకు కనిపిస్తున్న చిత్రంలో నాయకులంతా తామంతా ఒక్కటేనని, పార్టీలో విభేదాలు సహజమని చెబుతున్నప్పటికీ, లోలోపల మాత్రం అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రవర్తన చూస్తుంటే ఆయన పూర్తిస్థాయిలో అసహనంతో ఉన్నారని స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రితో ఉన్న గ్యాప్‌ను పూడ్చుకునే ప్రయత్నాలు జరగకపోగా, అది మరింత పెరుగుతూ వస్తోంది. గద్దర్ అవార్డుల వంటి వేదికను పార్టీ ఐక్యతకు ఉపయోగించుకోవాల్సింది పోయి, విభేదాల చర్చకు తావివ్వడం కాంగ్రెస్ శ్రేణులను ఆందోళనకు గురి చేస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో పట్టు సాధించే క్రమంలో రేవంత్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తుంటే, పాత కాంగ్రెస్ నేతలు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతున్నారు. ఈ క్రమంలోనే కోమటిరెడ్డి సోదరులు తమదైన శైలిలో చక్రం తిప్పాలని చూస్తున్నారు. కానీ, అధిష్టానం మద్దతు ఎవరికి



ఉందన్నదే ఇక్కడ కీలకం. కర్ణాటక తరహాలో ఇక్కడ కూడా నాయకత్వ మార్పు లేదా పీసీసీ పీఠం కోసం ఒత్తిళ్లు పెరగడం వల్ల ప్రభుత్వ పాలనపై ప్రభావం పడే అవకాశం ఉంది. అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయంలో నాయకులు ఇలా కుర్చీలాటలో నిమగ్నమవ్వడం పట్ల సామాన్య ప్రజల్లో కూడా చర్చ జరుగుతోంది. గద్దర్ లాంటి గొప్ప కళాకారుడి పేరుతో ఇచ్చే అవార్డుల వేడుక రాజకీయ రంగు పులుముకోవడం దురదృష్టకరం. కళాకారులను గౌరవించే వేదికపై రాజకీయ భేదాభిప్రాయాలను పక్కన పెట్టాల్సింది. కానీ, మంత్రి వెంకటరెడ్డి గైర్హాజరీతో ఆ వేడుక ప్రాముఖ్యత కంటే రాజకీయ వివాదమే హైలైట్ అయింది. ఇది కేవలం ఒక ప్రోగ్రామ్‌కు సంబంధించిన విషయం మాత్రమే కాదు, రాబోయే రోజుల్లో రాష్ట్ర కాంగ్రెస్‌లో జరగబోయే పెను మార్పులకు సంకేతంగా పరిగణించవచ్చు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో టాలీవుడ్ సమస్యలు పరిష్కారమవుతున్నా, శాఖా మంత్రిగా తనకు కనీస గౌరవం దక్కడం లేదని వెంకటరెడ్డి వాదనగా ఉంది. ఈ పరిణామాలు చూస్తుంటే రాబోయే రోజుల్లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరుకున్నట్లుగా ఆయనను తప్పిస్తారా లేక రాజగోపాల్ రెడ్డికి అవకాశం కల్పిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అదే సమయంలో జగ్గారెడ్డి పీసీసీ పీఠంపై వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను ఎటువైపు తిప్పుతాయో చూడాలి. సీనియారిటీకి విలువ ఇవ్వాలా లేక పనితీరుకు ప్రాధాన్యత ఇవ్వాలా అన్న సందిగ్ధంలో అధిష్టానం ఉంది. రేవంత్ రెడ్డి మాత్రం తనదైన శైలిలో ముందుకు సాగుతూ ప్రత్యర్థులకు గట్టి సమాధానమే ఇస్తున్నారు. ప్రస్తుతానికైతే కాంగ్రెస్ నేతల మధ్య ఉన్న 'కోల్డ్ వార్' గద్దర్ అవార్డుల సాక్షిగా బయటపడింది. ఏకగ్రీవంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన తరుణంలో ఇలాంటి లుకలుకలు పార్టీకి నష్టం కలిగిస్తాయని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మంత్రి వెంకటరెడ్డి మౌనం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో, ఆయన తదుపరి అడుగు ఎటువైపు పడుతుందో అన్నది ఇప్పుడు సస్పెన్స్ గా మారింది. రేవంత్ రెడ్డి వర్గం మాత్రం ఇవన్నీ చిన్నపాటి సర్దుబాట్లేనని కొట్టిపారేస్తోంది. ఏదేమైనా, ఈ ఉగాది గద్దర్ అవార్డులు రాజకీయాల్లో కొత్త మలుపులకు నాంది పలికాయని చెప్పవచ్చు. పార్టీలోని అంతర్గత సమస్యలను పరిష్కరించుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. ఒకవైపు ప్రతిపక్షాలు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో, ఇలాంటి అంతర్గత విభేదాలు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారుతున్నాయి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసంతృప్తి చల్లారుతుందా లేక అది మరింత తీవ్రరూపం దాల్చుతుందా అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి ఈ ఇష్యూ ఇంకా చర్చల్లోనే ఉంది. నాయకుల మధ్య సమన్వయం కుదరకపోతే గద్దర్ ఆశించిన మార్పు సమాజంలో రాకపోయినా, పార్టీలో మాత్రం మార్పులు ఖాయమనిపిస్తోంది.

## ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

**నిబంధనల అమలుపై నిశిత పరిశీలన.. కాపీయింగ్‌కు ఆస్కారం ఉండకూడదని ఆదేశం**

**నిజామాబాద్, విశాలభారతి:** పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని మానిక్ భవన్ పాఠశాలతో పాటు నలంద హైస్కూల్ ఎగ్జామ్ సెంటర్లను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? అని ఆరా తీశారు. తప్పనిసరిగా సి.సి కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల బండిల్ సీళ్లు తెరవాలని సూచించారు. ఈ మేరకు నిబంధనలు పాటించారా లేదా అని సి.సి ఫుటేజీల పరిశీలన ద్వారా నిర్ధారణ చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. ఎగ్జామ్ హాల్లోకి సిబ్బంది ఎవరైనా సెల్ ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ నిశిత పరిశీలన చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్ కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రశ్న పత్రాలను తప్పనిసరిగా తగిన పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు జె.శంకర్, టి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# భారతీయుల భద్రతే మా తొలి ప్రాధాన్యం

**విశాలభారతి, జాతీయం:**

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు యావత్ ప్రపంచాన్ని కలవరపెడుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా గ్లోబల్ ఎకానమీపై పెను ప్రభావం చూపుతోందని ఆయన హెచ్చరించారు. సోమవారం లోక్‌సభలో పశ్చిమాసియా పరిణామాలపై ప్రత్యేకంగా మాట్లాడిన ప్రధాని, ప్రస్తుత పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని స్పష్టం చేశారు. యుద్ధం వల్ల సామాన్య ప్రజల జీవన విధానం అస్తవ్యస్తం కావడమే కాకుండా అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ అప్రమత్తంగా ఉంటూనే శాంతిని కాంక్షిస్తోందని సభకు వివరించారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పటికే నాలుగో వారంలోకి ప్రవేశించాయని ప్రధాని గుర్తు చేశారు. ఈ సుదీర్ఘ పోరాటం వల్ల భారత్‌కు ఎదురయ్యే సవాళ్లను ఆయన కూలంకషంగా విశ్లేషించారు. ముఖ్యంగా ఆర్థిక, భద్రతాపరమైన అంశాలతో పాటు మానవతా దృక్పథంతో కూడా మనం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోందని చెప్పారు. పశ్చిమాసియా దేశాలు మనకు వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని, అక్కడి నుంచి వచ్చే ముడి చమురు, సహజ వాయువుపైనే మన దేశ ఇంధన అవసరాలు ప్రధానంగా ఆధారపడి ఉన్నాయని వివరించారు. వాణిజ్య పరంగా కూడా ఆ ప్రాంతం మనకు ఒక ప్రధాన వారధిలా పనిచేస్తుందని మోదీ పేర్కొన్నారు.

హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం వల్ల రవాణా వ్యవస్థకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయని ప్రధానమంత్రి తెలిపారు. ఎరువులు, గ్యాస్ వంటి నిత్యావసరాల దిగుమతులపై దీని ప్రభావం పడకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందని భరోసా ఇచ్చారు. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉండేలా చూడటంతో పాటు సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. మన దేశ ఎల్‌పీజీ అవసరాల్లో దాదాపు అరవై శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయని, ఈ తరుణంలో వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న భారతీయ పౌరుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని మోదీ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో సుమారు ఒక కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారని, వారి క్షేమం గురించి ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని చెప్పారు. అంతర్జాతీయ జలాల్లో ప్రయాణించే



వాణిజ్య నౌకల్లో కూడా మన సిబ్బంది గణనీయంగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే తాను వ్యక్తిగతంగా ఆయా దేశాల అధినేతలతో రెండుసార్లు ఫోన్లో మాట్లాడి చర్చలు జరిపానని తెలిపారు. మన పౌరుల రక్షణకు వారు పూర్తి హామీ ఇచ్చారని, అక్కడి రాయబార కార్యాలయాలు నిరంతరం వారితో టచ్‌లో ఉన్నాయని సభకు వివరించారు.

సంక్షోభం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు మూడు లక్షల డెబ్బై ఐదు వేల మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చామని ప్రధాని వెల్లడించారు. ఇరాన్ నుంచి వచ్చిన వారిలో ఏడు వందల మందికి పైగా వైద్య విద్యార్థులు ఉన్నారని, వారి విద్యా భవిష్యత్తుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. యుద్ధ భూమిలో కొందరు భారతీయులు ప్రాణాలు కోల్పోవడం, గాయపడటం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తున్నామని తెలిపారు. విదేశాల్లో చిక్కుకున్న వారికి తక్షణ సాయం అందించేందుకు ఇరవై నాలుగు గంటల హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గల్ఫ్ దేశాల్లోని సీబీఎస్ఈ పది, పన్నెండో తరగతి విద్యార్థులకు పరీక్షలను రద్దు చేసినట్లు ప్రధాని ఒక కీలక ప్రకటన చేశారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న వేళ వారి భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విద్యా సంవత్సరం వృధా కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారిని ఉన్నత తరగతులకు పంపేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి అంతర్జాతీయ సంక్షోభాలు ఎదురైనప్పుడు దేశం ఇబ్బంది పడకుండా ఉండేందుకు వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను పెంచుతున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం మన దేశం వద్ద ఐదు మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా చమురు నిల్వలు ఉన్నాయని, త్వరలోనే వీటిని ఆరున్నర మిలియన్ మెట్రిక్ టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మోదీ చెప్పారు. ఇంధనం కోసం కేవలం కొన్ని దేశాల పైనే ఆధారపడకుండా దిగుమతుల వనరులను విస్తృతం చేశామని తెలిపారు. గతంలో ఇరవై ఏడు దేశాల నుంచి మాత్రమే మనం చమురు కొనుగోలు చేసేవాళ్లమని, ఇప్పుడు ఆ సంఖ్యను నలభై ఒకటికి పెంచామని వివరించారు. ఈ వ్యూహాత్మక మార్పు వల్ల అంతర్జాతీయ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ దేశీయంగా ఇబ్బందులు కలగకుండా మేనేజ్ చేయగలుగుతున్నామని ప్రధానమంత్రి గర్వంగా ప్రకటించారు. యుద్ధం వల్ల ఎదురయ్యే సవాళ్లు కేవలం ఆర్థికపరమైనవే కాకుండా భద్రతాపరమైనవి కూడా ఉంటాయని మోదీ హెచ్చరించారు. ఇటువంటి అశాంతి సమయాల్లో కొన్ని శక్తులు దేశంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తాయని, అందుకే అన్ని నిఘా వర్గాలను అప్రమత్తం చేశామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఏ మాత్రం రాజీ పడబోమని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతర్జాతీయ దౌత్య నీతిలో భారత్ ఎప్పుడూ స్పష్టమైన వైఖరిని అనుసరిస్తుందని, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం కావాలని తాము మొదటి నుంచీ కోరుకుంటున్నామని మరోసారి నొక్కి చెప్పారు. కరోనా మహమ్మారి సమయంలో దేశం ఏ విధంగానైతే ఐక్యంగా నిలబడి గెలిచిందో, ఇప్పుడు పశ్చిమాసియా సంక్షోభం వల్ల తలెత్తే పరిణామాలను కూడా అదే స్ఫూర్తితో ఎదుర్కోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రపంచ పరిస్థితులు మన నియంత్రణలో లేకపోయినప్పటికీ, దేశాంతర్గత వ్యవస్థలను బలోపేతం చేసుకోవడం ద్వారా మనం నష్టాన్ని తగ్గించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని, విపత్కర పరిస్థితుల్లో పుకార్లను నమ్మవద్దని కోరారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం సామాన్య పౌరుడి భద్రతను దృష్టిలో ఉంచుకునే ఉంటుందని ఆయన పార్లమెంటు వేదికగా హామీ ఇచ్చారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనడం ప్రపంచ శాంతికి అత్యంత ఆవశ్యకమని మోదీ అభిప్రాయపడ్డారు. సంక్షోభ నివారణకు భారత్ తన వంతు దౌత్యపరమైన కృషిని కొనసాగిస్తుందని చెప్పారు. మానవతా దృక్పథంతో యుద్ధ ప్రభావిత ప్రాంతాలకు అవసరమైన మందులు, ఆహార పదార్థాలను పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అగ్రదేశాలు సైతం సంయమనం పాటించి శాంతి వైపు అడుగులు వేయాలని ఆయన ఆకాంక్షించారు. యుద్ధం ఎవరికీ మేలు చేయదని, అది కేవలం విధ్వంసానికి మాత్రమే దారితీస్తుందని తన ప్రసంగంలో స్పష్టం చేశారు. భారతదేశం ఎప్పుడూ వసుధైక కుటుంబం అనే సూత్రంతోనే ముందుకు సాగుతుందని గుర్తు చేశారు.

# భారీగా పతనమైన పసిడి

- **10 గ్రాముల ధర ఏకంగా రూ. 9,050 పతనం**
- **నాలుగు నెలల కనిష్టానికి బంగారం ధరలు**

**విశాలభారతి, న్యూఢిల్లీ/హైదరాబాద్**

దేశ రాజధానిలో సోమవారం బంగారం ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, దేశీయంగా డిమాండ్ తగ్గడంతో పసిడి ధరల్లో పెను మార్పు చోటుచేసుకుంది. కేవలం ఒక్క రోజులోనే 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 9,050 మేర పతనమై రూ. 1.43 లక్షల వద్ద స్థిరపడింది. పసిడితో పాటే వెండి కూడా అదే బాటలో పయనిస్తూ భారీగా తగ్గింది. కేజీ వెండి ధర రూ. 10,500 తగ్గి రూ. 2.30 లక్షల స్థాయికి చేరుకుంది. ఈ



అకస్మాత్తు పతనం అటు పెట్టుబడిదారులను, ఇటు కొనుగోలుదారులను విస్మయానికి గురిచేస్తున్నది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర సుమారు 6 శాతం మేర క్షీణించింది. గత శుక్రవారం రూ. 1,52,650 వద్ద ముగిసిన ధర, సోమవారం నాటికి అన్ని పన్నులతో కలుపుకుని రూ. 1,43,600 కు పడిపోయింది. అంతర్జాతీయ వేదికలపై బంగారం ధరలు నాలుగు నెలల కనిష్టానికి చేరుకోవడమే ఈ భారీ పతనానికి ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు స్థానిక జ్యువెలర్ల నుంచి డిమాండ్ మందగించడం కూడా ధరల తగ్గుదలకు కారణమైంది. వెండి విషయంలోనూ ఇదే విధమైన ట్రెండ్ కనిపిస్తోంది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ. 2,40,500 వద్ద ఉన్న కేజీ వెండి ధర, 4.36 శాతం క్షీణించి రూ. 2,30,000 కు చేరుకుంది. కొంతకాలంగా రికార్డు స్థాయిల్లో కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు ఇప్పుడు ఒక్కసారిగా దిగిరావడంతో సామాన్య ప్రజలకు ఇది కొంత ఊరటనిచ్చే అంశమే.

# ట్రంప్ భయపడ్డారు




మొదటిపేజీ తరువాయి

దారితీసినప్పటికీ, టెహ్రాన్ మాత్రం ట్రంప్ వ్యాఖ్యలను కొట్టిపారేసింది. అమెరికాతో తాము ఎటువంటి చర్చలు జరపడం లేదని, ఇది కేవలం మైండ్ గేమ్ మాత్రమేనని ఇరాన్ స్పష్టం చేయడం గమనార్హం. ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే ఇరాన్ ప్రభుత్వ మీడియా దీనిపై ఘాటుగా స్పందించింది. తమ ఇంధన సంస్థలపై లేదా విద్యుత్ గ్రిడ్లపై శత్రువుల నుంచి ఎలాంటి దాడి జరిగినా, తాము కూడా శత్రువుల ఇంధన వనరులపై కనికరం లేకుండా విరుచుకుపడతామని హెచ్చరించింది. ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగుతుందనే భయంతోనే ట్రంప్ ఇప్పుడు వెనక్కి తగ్గారని, ఇది అమెరికా బలహీనతను సూచిస్తోందని టెహ్రాన్ విశ్లేషించింది. ట్రంప్ మాటలను తాము ఏమాత్రం నమ్మబోమని, దాడుల వాయిదా పేరుతో తగిన సమయం చూసి కుట్ర పూరితంగా దాడి చేసేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఇరాన్ అనుమానం వ్యక్తం చేస్తోంది. యుద్ధ తంత్రంలో భాగంగానే అమెరికా ఇలాంటి నాటకాలకు తెరలేపిందని మండిపడింది. మరోవైపు ఇజ్రాయెల్ సైతం ట్రంప్ నిర్ణయంపై తనదైన శైలిలో స్పందించింది. యుద్ధ విరమణ అనేది అమెరికాకు మాత్రమే పరిమితమని, తాము మాత్రం యుద్ధాన్ని ఆపలేదని ఇజ్రాయెల్ సైన్యం స్పష్టం చేసింది. ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తామనే సంకేతాలను ఇవ్వడం ద్వారా మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత రాజుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు శాంతి మంత్రం పఠిస్తున్నా, ఆయన సన్నిహిత మిత్రదేశమైన ఇజ్రాయెల్ మాత్రం దూకుడు తగ్గించకపోవడం గమనార్హం. ఇది అగ్రరాజ్యం వ్యూహమా లేక ఇజ్రాయెల్ స్వతంత్ర నిర్ణయమా అనే కోణంలో విశ్లేషకులు ఆలోచనలో పడ్డారు. ఇరాన్ చుట్టూ ఇజ్రాయెల్ బలగాలు మోహరించి ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం ఫిబ్రవరి 28న జరిగిన సంఘటనలు. ఆ రోజున ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా దాడులకు దిగడంతో ఇరాన్ ప్రభుత్వం ఆగ్రహంతో హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే ముడి చమురులో దాదాపు మూడో వంతు ఈ జలసంధి నుంచే వెళ్తుంది. ఇది మూతపడటంతో ఒక్కసారిగా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభం తలెత్తే పరిస్థితి రావడంతో అమెరికాపై ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవాలని, లేదంటే భారీ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ ఇరాన్‌కు 48 గంటల డెడ్‌లైన్ విధించారు. ట్రంప్ విధించిన గడువు మంగళవారంతో ముగియడంతో ప్రపంచమంతా ఉత్కంఠగా ఎదురుచూసింది. గడువు ముగిసిన వెంటనే అమెరికా దాడులకు దిగుతుందని భావించిన తరుణంలో, ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్ ద్వారా విరామం ప్రకటించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. చర్చల ప్రక్రియ కొనసాగుతోందని, ఆ ఫలితాల ఆధారంగానే భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ ఐదు రోజుల విరామం అనేది కేవలం వ్యూహాత్మకమైనదా లేక నిజంగానే శాంతి చర్చలకు మార్గం సుగమం అవుతుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇరాన్ మాత్రం తన మొండివైఖరిని వీడకుండా జలసంధిని మూసే ఉంచుతామని చెబుతోంది. ఇరాన్ ఇంధన వనరులే లక్ష్యంగా దాడులు చేస్తామని అమెరికా బెదిరించడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఆ దేశ ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే. విద్యుత్ కేంద్రాలు ధ్వంసమైతే దేశం అంధకారంలోకి వెళ్లడమే కాకుండా, ప్రజల్లో అసహనం పెరుగుతుందని ట్రంప్ భావిస్తున్నారు. కానీ ఇరాన్ సైనిక నాయకత్వం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. తమ భూభాగంపై చిన్న దాడి జరిగినా మధ్యప్రాచ్యంలో ఉన్న అమెరికా స్థావరాలన్నింటినీ నేలమట్టం చేస్తామని ప్రకటించింది. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల నడుమ అగ్రరాజ్యం తన దౌత్య మార్గాలను కూడా ఉపయోగిస్తోంది. అయితే చర్చల విషయంలో ఇరాన్ ఇస్తున్న వివరణ ట్రంప్ ప్రకటనకు పూర్తి భిన్నంగా ఉండటం గందరగోళానికి దారితీస్తోంది.

ట్రంప్ అనుసరిస్తున్న ఈ 'హిట్ అండ్ రన్' దౌత్యం గతంలోనూ మనం చూశాం. మొదట తీవ్రంగా హెచ్చరించడం, ఆపై చర్చలకు సిద్ధమని చెప్పడం ఆయన శైలి. కానీ ఇరాన్ నాయకత్వం ఈ విరామాన్ని ఒక అవకాశంగా చూస్తోంది. అమెరికా దాడులకు సిద్ధమవ్వడానికి సమయం తీసుకుంటోందని, అందుకే ఈ ఐదు రోజుల వాయిదా డ్రామా ఆడుతోందని వారు విశ్లేషిస్తున్నారు. ఇరాన్ సరిహద్దుల్లో ఇప్పటికే యుద్ధ నౌకలు, బాంబర్ విమానాలు సిద్ధంగా ఉన్నాయి. ఇజ్రాయెల్ గూఢచారి సంస్థలు కూడా ఇరాన్‌లోని అణు కేంద్రాలు, క్షిపణి స్థావరాల సమాచారాన్ని నిరంతరం సేకరిస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధ విరమణ అనే మాట కేవలం కాగితాలకే పరిమితం కావచ్చు.

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉంది. హోర్ముజ్ జలసంధి మూసివేత వల్ల రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. దీని ప్రభావం కేవలం అమెరికా, ఇరాన్ లపైనే కాకుండా భారత్ వంటి దేశాలపై కూడా తీవ్రంగా పడుతోంది. అందుకే ట్రంప్ పై అంతర్జాతీయ సమాజం నుంచి యుద్ధం వద్దు అనే ఒత్తిడి పెరుగుతోంది. చర్చల పేరుతో సమయం గడపడం వల్ల చమురు సరఫరా పునరుద్ధరణకు ఏదైనా మార్గం దొరుకుతుందేమోనని ట్రంప్ ఆశిస్తున్నారు. కానీ ఇరాన్ మాత్రం తన షరతులను అంగీకరిస్తేనే జలసంధిని తెరుస్తామని భీష్మించుక కూర్చుంది. ఈ పీటముడి విడిపోవడం అంత సులభంగా కనిపించడం లేదు. యుద్ధ విరమణ అమెరికాకే పరిమితమన్న ఇజ్రాయెల్ వ్యాఖ్యలు ట్రంప్ పాలనపై ఉన్న పట్టును ప్రశ్నిస్తున్నాయి. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇరాన్‌పై కఠినంగా ఉండాలని కోరుకుంటున్నారు. ట్రంప్ తన దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, చమురు ధరలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. కానీ ఇజ్రాయెల్ కు అలాంటి ఇబ్బందులు లేవు. వారు ఇరాన్ క్షిపణి ముప్పును శాశ్వతంగా తొలగించాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈ వైరుధ్యం వల్ల అమెరికాఇజ్రాయెల్ కూటమిలో కూడా కొన్ని విభేదాలు తలెత్తే అవకాశం ఉంది. ఇది ఇరాన్‌కు కలిసివచ్చే అంశమని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ ఐదు రోజుల గడువు ఇచ్చినప్పటికీ, ఈ లోగా ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే యుద్ధం మొదలవ్వడానికి సెకన్ల సమయం కూడా పట్టదు. ఇరు పక్షాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసింది. ఒకవేళ ఇంధన వనరులపై దాడి జరిగితే దానికి ప్రతీకారంగా ఎమిరేట్స్, సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలను కూడా లక్ష్యం చేసుకుంటామని ఇరాన్ పరోక్షంగా హెచ్చరించింది. దీనివల్ల మొత్తం గల్ఫ్ ప్రాంతం మంటల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. అందుకే ఈ ఐదు రోజులు ప్రపంచానికి ఎంతో కీలకం కానున్నాయి. మొత్తానికి పశ్చిమాసియాలో పరిస్థితి క్లిష్టంగా మారింది. ట్రంప్ ప్రకటన శాంతికి నాంది పలుకుతుందా లేక పెను తుపాను ముందు ప్రశాంతతనా అనేది కాలమే నిర్ణయించాలి. ఇరాన్ స్పందన చూస్తుంటే వారు ఎటువంటి చర్చలకు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది. అమెరికా కుట్రలను తిప్పికొడతామని వారు పదే పదే చెబుతున్నారు. అగ్రరాజ్యం తన సైనిక బలాన్ని చూపి బెదిరిస్తుంటే, ఇరాన్ తన భౌగోళిక వ్యూహంతో ఇబ్బంది పెడుతోంది. ఈ సాయుధ పోరులో చివరకు విజయం ఎవరిని వరిస్తుంది, ప్రపంచ ఇంధన అవసరాలు ఎలా తీరుతాయి అనేది రానున్న ఐదు రోజుల్లో తేలిపోనుంది.

# యుద్ధానికి బ్రేక్



**విశాలభారతి, అంతర్జాతీయం:**

ప్రపంచ దేశాలను వణికిస్తున్న యుద్ధ మేఘాల మధ్య అగ్రరాజ్యం అమెరికా అనూహ్యమైన నిర్ణయంతో అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. ఇరాన్‌లోని వ్యూహాత్మక అణు విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా జరగాల్సిన దాడులను మరో ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. గత కొన్ని వారాలుగా పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు ఎప్పుడైనా పెను విధ్వంసానికి దారితీయవచ్చనే ఆందోళనల మధ్య, ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ, ఉత్కంఠను మాత్రం తగ్గించలేదు. శాంతి స్థాపనకు ఇంకా ఒక చివరి అవకాశం ఉందని, ప్రస్తుతం సాగుతున్న తెరవెనుక దౌత్య చర్చలు ఆశాజనకంగా ఉన్నాయని వైట్ హౌస్ వర్గాలు పేర్కొనడం గమనార్హం. ఇరాన్ చేపట్టిన అణు కార్యక్రమాలు కేవలం విద్యుత్ అవసరాల కోసమేనని ఆ దేశం వాదిస్తున్నప్పటికీ, అగ్రరాజ్యం మాత్రం దానిని అణ్వాయుధ తయారీకి ముందస్తు వ్యూహంగానే పరిగణిస్తోంది. ముఖ్యంగా ఇరాన్ తన యురేనియం శుద్ధి ప్రక్రియను వేగవంతం చేయడంపై అమెరికా నిఘా వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే పెంటగాన్ తన యుద్ధ విమానాలను, క్షిపణి వ్యవస్థలను సర్వం సిద్ధం చేసి, దాడులకు కేవలం గ్రీన్ సిగ్నల్ కోసం వేచి చూసింది. అయితే, చివరి నిమిషంలో దౌత్య మార్గాల ద్వారా పరిష్కారం లభించే వెసులుబాటు ఉందని కొందరు అంతర్జాతీయ మధ్యవర్తులు సూచించడంతో, ట్రంప్ తన నిర్ణయాన్ని పునరాలోచించుకున్నట్లు తెలుస్తోంది. చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయని, అందుకే అదనపు సమయం ఇస్తున్నామని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన విలక్షణమైన 'ఆర్ట్ ఆఫ్ ది డీల్' రాజకీయ శైలిని మరోసారి గుర్తుచేస్తున్నాయి. ఒకవైపు కఠినమైన హెచ్చరికలు జారీ చేస్తూనే, మరోవైపు చర్చలకు ద్వారాలు తెరిచి ఉంచడం ద్వారా ఇరాన్‌ను తీవ్రమైన ఒత్తిడిలోకి నెట్టడం ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ఐదు రోజుల గడువు అనేది కేవలం సమయం ఇవ్వడం మాత్రమే కాదు, ఇరాన్ తన పంతాన్ని వీడి లొంగివస్తుందా లేదా అని తేల్చుకోవడానికి ఇచ్చిన ఆఖరి హెచ్చరికగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా వెనకడుగు వేసిందని ఎవరైనా భావిస్తే అది పొరపాటే అవుతుందని ట్రంప్ పరోక్షంగా హెచ్చరించారు. అంతర్జాతీయ సమాజం ఈ పరిణామాలను అత్యంత నిశితంగా గమనిస్తోంది. ఒకవేళ అమెరికా గనుక ఇరాన్ అణు కేంద్రాలపై నేరుగా దాడులకు దిగితే, అది కేవలం రెండు దేశాల మధ్య పోరుతో ఆగకుండా మొత్తం మధ్య ప్రాచ్య ప్రాంతాన్ని అగ్నిగుండంగా మారుస్తుందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. చమురు సరఫరా వ్యవస్థ దెబ్బతినడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని ఐరోపా దేశాలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటువంటి క్లిష్ట సమయంలో ఐదు రోజుల విరామం అనేది దౌత్యపరమైన మంతనాలకు ఒక గొప్ప అవకాశంగా మారింది. ఈ గడువు ముగిసేలోగా ఇరాన్ తన పంథాను మార్చుకోకపోతే పరిస్థితులు ఊహించని విధంగా మారవచ్చు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు.

# ప్రభుత్వంది భస్మాసుర హస్తం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో వ్యవసాయం, రైతు సంక్షేమం అంశాలు మరోసారి అగ్గి రాజేస్తున్నాయి. శాసనసభ వేదికగా సాగునీటి ప్రాజెక్టులు, రుణమాఫీ, రైతు భరోసా అమలుపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శనాస్త్రాలు సంధించారు. రైతాంగం పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబడుతూ, కాంగ్రెస్ పాలనలో అన్నదాతల పరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు రైతుల పాలిట భస్మాసుర హస్తంలా మారుతున్నాయని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రైతు భరోసా, రుణమాఫీపై జరిగిన చర్చలో హరీష్ రావు అత్యంత ఘాటుగా స్పందించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతులకు మేలు చేస్తున్నామంటూనే, క్షేత్రస్థాయిలో వారిని దగా చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యంగా రైతు భరోసా పెంపు విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని, దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ఆశలను అడియాశలు చేస్తూ, కాలయాపన చేయడం సరికాదని హరీష్ రావు ఈ సందర్భంగా హితవు పలికారు.

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ప్రతి ఎకరాకు రూ. 15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రగల్భాలు పలికిందని హరీష్ రావు గుర్తు చేశారు. అయితే, తీరా అధికారంలోకి వచ్చి బడ్జెట్ ప్రవేశపెట్టే సమయానికి ఆ అంకె రూ. 12 వేలకు పడిపోవడం ఏంటని ఆయన నిలదీశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని పక్షంలో రైతులకు క్షమాపణ చెప్పాలని ఆయన సూచించారు. మేనిఫెస్టోలోని అంశాలకు, బడ్జెట్ కేటాయింపులకు పొంతన లేక



పోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. రైతులను తప్పుదోవ పట్టించేలా అంకెల గారడీ చేయడం కాంగ్రెస్ నైజమని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు రూ. 19 వేల కోట్ల రైతు బంధు నిధులను ప్రభుత్వం నిలిపివేసిందని హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ లేని విధంగా నిధుల కొరత నెపంతో అన్నదాతలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై నాట్లు వేసే సమయానికి అందాల్సిన పెట్టుబడి సాయం, ఇప్పుడు కోతల సమయం వస్తున్నా అందకపోవడం శోచనీయమన్నారు. సమయానికి పైసలు చేతికి అందక రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని, ఇది ప్రభుత్వం చేస్తున్న పెద్ద తప్పిదమని ఆయన అభివర్ణించారు.

రుణమాఫీ అంశంపై ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు ఎక్కడా పొంతన లేదని హరీష్ రావు ఉదాహరణలతో వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ ప్రక్రియ సంపూర్ణంగా పూర్తయిందని మంత్రులు గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ గ్రామాల్లోకి వెళ్లి చూస్తే పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. వేలాది మంది రైతులు ఇప్పటికీ తమ రుణాల మాఫీ కోసం బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. సాంకేతిక కారణాలు చూపుతూ అర్హులైన రైతులను జాబితా నుంచి తొలగించడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ గణాంకాలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆయన ఎద్దేవా చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల ఆత్మహత్యలను నివారించడమే లక్ష్యంగా రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని హరీష్ రావు గుర్తు చేశారు. కరోనా వంటి మహమ్మారి సమయంలోనూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా తగ్గకుండా రైతులకు సాయం అందించామని వివరించారు. ఎన్ని విపత్తులు వచ్చినా పథకం ఆగిపోలేదని, కానీ ఇప్పుడు రేవంత్ సర్కార్ రైతులకు ఇచ్చే సాయంపై కోతలు పెడుతూ వారి పొట్ట కొడుతోందని ధ్వజమెత్తారు. రైతుల సంక్షేమం పట్ల గత ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ప్రస్తుత ప్రభుత్వానికి లేదని ఆయన విమర్శించారు.

వ్యవసాయ క్యాలెండర్‌ను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని హరీష్ రావు విమర్శించారు. రైతులకు ఎప్పుడు సాయం అవసరమో తెలియని స్థితిలో పాలకులు ఉన్నారని దుయ్యబట్టారు. నాట్లు వేసే సమయంలో పెట్టుబడి కోసం రైతులు ఇబ్బంది పడుతుంటే, ప్రభుత్వం మాత్రం కాలయాపన చేస్తూ చర్చల పేరుతో కాలం గడుపుతోందని మండిపడ్డారు. సరైన సమయంలో నిధులు విడుదల చేయకుండా, పంట చేతికి వచ్చే సమయంలో ప్రకటనలు చేయడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ అసమర్థత వల్ల సాగు విస్తీర్ణంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుత బడ్జెట్ ప్రతులపై కూడా హరీష్ రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బడ్జెట్ రూపకల్పనలో కొత్తదనం లేదని, పాత పథకాలకు పేర్లు మార్చి ప్రవేశపెట్టిన కాపీ పేస్ట్ తరహాలో ఉందని వ్యాఖ్యానించారు. యువ వికాసం వంటి పథకాలకు గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కూడా ఇప్పటివరకు వినియోగంలోకి రాలేదని, కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టడానికి అట్టహాసంగా పథకాలను ప్రకటించడం, ఆ తర్వాత నిధులు ఇవ్వకుండా వాటిని అటకెక్కించడం కాంగ్రెస్ మార్క్ రాజకీయమని ఆయన విమర్శించారు. రైతుల రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఏ మూలకు సరిపోవని హరీష్ రావు గణాంకాలతో వివరించారు. అర్హులైన ప్రతి రైతుకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న హామీ ఎప్పుడు నెరవేరుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కండిషన్ల పేరుతో కోతలు విధిస్తూ రైతులను వంచించడం సరికాదన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్న ప్రతి ఒక్కరికీ బేషరతుగా రుణమాఫీ అమలు చేయాలని ఆయన పట్టుబట్టారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ అన్నదాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరించవద్దని హరీష్ రావు సూచించారు. రాష్ట్ర పురోభివృద్ధిలో రైతుల పాత్ర అత్యంత కీలకమని, వారిని విస్మరిస్తే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న రుణమాఫీ దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేదని, దీనిపై అసెంబ్లీలోను, బయట కూడా తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. మొత్తంగా, తెలంగాణలో రైతాంగ సమస్యలపై ప్రతిపక్షం గళం విప్పడంతో రాజకీయం వేడెక్కింది. హరీష్ రావు చేసిన విమర్శలకు ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. రైతుల సంక్షేమం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రతి గింజకు మద్దతు ధర కల్పించడంతో పాటు హామీలన్నీ నెరవేర్చాలని ప్రతిపక్షం గట్టిగా కోరుతోంది. రాబోయే రోజుల్లో రైతు భరోసా మరియు రుణమాఫీ అంశాలు మరింత చర్చకు దారితీసే అవకాశం ఉంది. అన్నదాతల గోడును ప్రభుత్వం ఆలకిస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

# బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు అరెస్టు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర రాజధాని నడిబొడ్డున కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారతీయ జనతా పార్టీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం పెను ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీజేపీ శ్రేణులు కదం తొక్కడంతో నాంపల్లి నుంచి అసెంబ్లీ వరకు ఉన్న ప్రధాన రహదారులన్నీ రణరంగాన్ని తలపించాయి. వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు పోలీసు బారికేడ్లను తోసుకుంటూ ముందుకు దూసుకెళ్లడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన సర్కార్‌కు కనువిప్పు కలిగేలా ఈ నిరసన చేపట్టినట్లు కాషాయ దళం ప్రకటించింది. శాంతియుతంగా సాగుతున్న తమ ఆందోళనను అణచివేయాలని చూడటం అప్రజాస్వామికమని నేతలు మండిపడ్డారు. అసెంబ్లీ ముట్టడిని భగ్నం చేసేందుకు పోలీసులు భారీగా మోహరించినప్పటికీ కమలనాథులు వారి కళ్లుగప్పి వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పోలీసుల వ్యూహాలను చిత్తు చేస్తూ ఒక సామాన్యుడి తరహాలో ఆటోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. నిఘా నీడలో ఉన్న అసెంబ్లీ ప్రధాన గేటు వరకు ఆయన చేరుకోవడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఆటో నుంచి దిగి గేటు వద్ద నిరసన తెలుపుతుండగా గమనించిన పోలీసులు వెంటనే ఆయనను చుట్టుముట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం కాలరాస్తోందని ఈ సందర్భంగా రాంచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కేవలం మాటలకే పరిమితమైందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ఏమైందని ప్రశ్నిస్తూ సర్కార్‌ను నిలదీశారు. సామాన్య ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వారి కష్టాలను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. పేదల బతుకులతో ఆడుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కాలం దగ్గర పడిందని ఆయన హెచ్చరించారు.



నిరసనకారులను అదుపు చేసే క్రమంలో పోలీసుల తీరుపై బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బారికేడ్ల వద్ద తోపులాట జరగడంతో కొందరు కార్యకర్తలు కిందపడిపోయారు, మరి కొందరు గాయపడ్డారు. అయినప్పటికీ వెనక్కి తగ్గకుండా కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా, ప్రభుత్వ వైఫల్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పరిసర ప్రాంతాలను హోరెత్తించారు. చట్టసభలు జరుగుతున్న సమయంలో ప్రజల గొంతుకను వినిపించడమే తమ లక్ష్యమని నేతలు స్పష్టం చేశారు. అరెస్టులకు తాము భయపడేది లేదని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ అసలు రంగును బయటపెడతామని వారు శపథం చేశారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ ముట్టడి కార్యక్రమం పోలీసు యంత్రాంగానికి చుక్కలు చూపించింది. అసెంబ్లీకి దారితీసే నాలుగు వైపుల నుంచి కార్యకర్తలు విడతల వారీగా చొచ్చుకురావడంతో పోలీసులకు ఎవరిని అడ్డుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఒక వైపు అరెస్టులు జరుగుతుండగానే మరో వైపు నుంచి కార్యకర్తలు దూసుకురావడం ఖాకీలను అయోమయానికి గురిచేసింది. గెరిల్లా తరహాలో సాగిన ఈ నిరసన ప్రదర్శనలో సుమారు రెండు వేల మందికి పైగా పాల్గొన్నట్లు అంచనా. భద్రతా వలయాలను ఛేదించుకుని పదిసార్లకు పైగా ముట్టడికి ప్రయత్నించడం గమనార్హం.

శాంతి భద్రతల పరిరక్షణ పేరుతో పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాంచందర్ రావుతో పాటు కీలక నాయకులను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైనందుకు ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచలేరని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి. ఎన్నికల ముందు ఆకాశమే హద్దుగా హామీలు ఇచ్చి ఇప్పుడు అమలులో మొండిచేయి చూపడం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని నేతలు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ లోపల, బయట పోరాడుతామని ప్రకటించారు. ముట్టడి కార్యక్రమానికి భారీ స్పందన రావడం కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి ఆరంభమని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అసెంబ్లీ పరిసరాల్లో ఎటు చూసినా కాషాయ జెండాలు, పోలీసుల మోహరింపుతో యుద్ధ వాతావరణం కనిపించింది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా కార్యకర్తలు వాటన్నింటినీ దాటుకుని అసెంబ్లీ ఎంట్రీ పాయింట్ వరకు రావడం ప్రభుత్వ వైఫల్యమేనని బీజేపీ నేతలు విశ్లేషించారు. శాంతియుత నిరసనలపై లాఠీలు ఝుళిపించడం ప్రభుత్వ దౌర్జన్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజా గొంతుకను నొక్కివేయాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. అరెస్టు చేసిన నాయకులను నాంపల్లి, అబిడ్స్ పోలీస్ స్టేషన్లకు తరలించడంతో అక్కడ కూడా ఉద్రిక్తత కొనసాగింది. పార్టీ కార్యకర్తలు స్టేషన్ల వద్దకు చేరుకుని తమ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్రాలను ప్రదర్శించారు.

# విశ్వనగరంగా హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి**

'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికతను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మండలి ముందు ఉంచారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించడమే కాకుండా, రాబోయే పాతికేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరం కేవలం కాంక్రీట్ జంగిల్‌గా మారకుండా, పర్యావరణ హితంగా ఎదిగేలా ఈ ప్రణాళికలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశంలోని ఇతర మహానగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ప్రస్తుతం నెలకొన్న విపత్కర పరిస్థితులను రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ఆ నగరాల్లో ఎదురవుతున్న సమస్యలను పాఠాలుగా నేర్చుకుని, హైదరాబాద్‌కు అటువంటి దుస్థితి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న భాగ్యనగరానికి పూర్వవైభవం తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పునరుద్ఘాటించారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ తలెత్తే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోకపోతే భవిష్యత్ తరాలకు తీరని అన్యాయం చేసినట్లు అవుతుందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నల్గొండ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా మూసీ మురికి నీటి వల్ల ఎదుర్కొంటున్న కష్టాలను రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కలుషిత నీటితో పండుతున్న పంటలు, వ్యాపిస్తున్న వ్యాధులు, ఆ ప్రాంత ప్రజల ఆవేదనా భరితమైన జీవిత సత్యాలను ఎరిగిన వారెవరూ ఈ ప్రక్షాళన ప్రాజెక్టును అడ్డుకోవాలని అనుకోరని ఆయన తేల్చి చెప్పారు. మానవతా దృక్పథంతో ఆలోచిస్తే ఈ ప్రాజెక్టు ఎంత అవసరమో అర్థమవుతుందని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టకూడదని హితవు పలికారు. మూసీ శుద్ధి జరిగితేనే నల్గొండ రైతాంగానికి, ప్రజలకు విముక్తి కలుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై మరింత పారదర్శకత కోసం, అందరి సలహాలను పరిగణనలోకి తీసుకోవడానికి ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి



విక్రమార్క నాయకత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన ఈ సబ్ కమిటీ ప్రజల నుంచి, నిపుణుల నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిశీలిస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలు జరిపి, అందరినీ భాగస్వాములను చేస్తూనే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని రేవంత్ రెడ్డి మండలి సాక్షిగా భరోసా ఇచ్చారు. హైదరాబాద్ నగరం అనగానే దేశవ్యాప్తంగా ప్రజలు ఫార్మా హబ్‌గా, అత్యంత నివాసయోగ్యమైన నగరంగా గుర్తుంచుకుంటారని ఆయన వివరించారు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడులు రావాలన్నా, ప్రతిభావంతులు ఇక్కడ స్థిరపడాలన్నా నగరం సురక్షితంగా, పరిశుభ్రంగా ఉండాలని కోరారు. ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను కాపాడుకుంటూనే, లోపాలను సరిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్థిక రాజధానిగా ఉన్న ముంబైలో నేడు భారీ వర్షాలు కురిస్తే జనజీవనం పూర్తిగా స్తంభించిపోయే పరిస్థితులు ఉండటాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో విపరీతమైన వాయు కాలుష్యం కారణంగా ప్రజలు శ్వాస తీసుకోవడానికే ఇబ్బంది పడుతున్నారని, బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలు నగరాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని రేవంత్ రెడ్డి విశ్లేషించారు. చెన్నైలో భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారీ పడవలే శరణ్యం అవుతున్నాయని, ఇలాంటి విపత్తులు హైదరాబాద్‌కు రాకుండా ఉండాలంటే మూసీ ప్రక్షాళన ఒక్కటే మార్గమని చెప్పారు. ఒకప్పుడు చెరువులు, కుంటలు, రాళ్లతో కళకళలాడిన హైదరాబాద్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గతంలో జరిగిన మానవ తప్పిదాల వల్లే ఇప్పుడు మనం కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నామని ఆయన వాపోయారు.

అక్రమ కట్టడాల వల్ల, నదీ పరివాహక ప్రాంతాల ఆక్రమణల వల్ల వరద ముప్పు పెరిగిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ తప్పిదాలను సవరించి, మూసీని మళ్లీ స్వచ్ఛమైన నదిగా మార్చడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని వివరించారు. ప్రజలను ఖాళీ చేయించడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, కానీ నది గర్భంలో నివసిస్తున్న వారి ప్రాణాలకు రక్షణ కల్పించడంతో పాటు వారికి గౌరవప్రదమైన జీవనాన్ని అందించడమే తమ ప్రాధాన్యత అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులు, విద్యా, వైద్య సదుపాయాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నగర జీవన ప్రమాణాలను మెరుగుపరిచే క్రమంలో మెట్రో రైలు విస్తరణకు కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ట్రాఫిక్ కష్టాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడంతో పాటు, నగరం నలుమూలలకూ వేగవంతమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే తమ ధ్యేయమన్నారు. మూసీ పునర్జీవన ప్రాజెక్టులో భాగంగా నదికి ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం వల్ల ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది కేవలం పర్యావరణ ప్రాజెక్టు మాత్రమే కాదని, ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడుతుందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఈ సాహసోపేత నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరారు. ఇది కేవలం ఒక పార్టీకో లేదా ఒక ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని, తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన విషయమని గుర్తు చేశారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి ప్రయోజనాలను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన కరాఖండిగా చెప్పారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.



# కాంగ్రెస్ నెక్స్ట్ సీఎం బీసీనే..!

**మొదటిపేజీ తరువాయి**

ప్రాతినిధ్యంపై ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి పదవి అంశంపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించాయి. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్న సంకేతాలను పంపుతూ, భవిష్యత్తులో బీసీ నాయకుడే రాష్ట్ర పీఠాన్ని అధిరోహిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదని, రాబోయే కాలంలో కాంగ్రెస్ అనుసరించబోయే రాజకీయ వ్యూహానికి నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పదవిపై మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను నేరుగా టార్గెట్ చేశాయి. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని, సామాన్యుడికి కూడా ఉన్నత పదవులు దక్కుతాయని ఆయన పునరుద్ఘాటించారు. తమ పార్టీలో భవిష్యత్తులో బీసీ వర్గానికి చెందిన నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన జోస్యం చెప్పారు. ఇదే ధైర్యం ఇతర పార్టీలకు ఉందా అని ఆయన సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గానీ, లేదా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గానీ తమ పార్టీల నుంచి ఒక బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించగలరా అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఈ సవాల్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

బీజేపీపై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీల ప్రయోజనాలను తుంగలో తొక్కుతోందని ఆయన ఆరోపించారు. బీజేపీ నాయకులు సిద్ధాంతపరంగానే బీసీ వ్యతిరేకులని, కేవలం ఓట్ల కోసమే వారు వెనుకబడిన వర్గాల జపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జాతీయ స్థాయిలో బీసీ గణన చేపట్టడానికి వెనకాడుతున్న బీజేపీకి, బీసీల గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన మండిపడ్డారు. మాటలతో మోసం చేయడం తప్ప, చేతల్లో ఆ వర్గాలకు చేసింది ఏమీ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలోనే బీసీలకు నిజమైన గుర్తింపు దక్కుతుందని, దానికి తానే ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. ఒక సామాన్య కార్యకర్తగా ప్రస్థానం మొదలుపెట్టిన తనకు టీపీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టడమే కాంగ్రెస్ సామాజిక నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలను మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా 'బీసీ డిక్లరేషన్' అంశాన్ని ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ డిక్లరేషన్ ప్రకటించిందని, దానికి చట్టబద్ధత కల్పించే దిశగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన కులవృత్తులను ఆదుకోవడానికి ప్రత్యేక పథకాలను రూపొందిస్తున్నామని చెప్పారు. బీసీల ఆర్థిక స్వావలంబన కోసం బ్యాంక్ లింకేజీ రుణాలు, సబ్సిడీలను పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ పథకాన్ని మహేశ్ కుమార్ గౌడ్ ఒక చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. రాష్ట్రంలోని పేదలందరికీ నాణ్యమైన సన్నబియ్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని, దీనివల్ల లక్షలాది కుటుంబాలకు మేలు జరుగుతోందని అన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చేవారని, కానీ తమ ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సాహసోపేత నిర్ణయం తీసుకుందని కొనియాడారు. సన్నబియ్యం పంపిణీ వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడినా, ప్రజల సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే దానం కేసు యూటర్న్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వేటు వ్యవహారం ఇప్పుడు అనూహ్యమైన మలుపు తిరిగింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న దానంపై అనర్హత వేటు వేయాలంటూ సాగుతున్న సుదీర్ఘ న్యాయపోరాటం, తాజాగా బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌తో కొత్త సమీకరణాలకు తెరలేపింది. గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ గుర్తుపై పోటీ చేసి విజయం సాధించిన దానం, ఆ తర్వాత రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో హస్తం పార్టీకి జై కొట్టారు. అప్పటి నుంచి ఆయన శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ నేతలు పట్టుబడుతూనే ఉన్నారు. వాస్తవానికి ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై గతంలోనే పెద్ద ఎత్తున దుమారం రేగింది. బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సుప్రీం కోర్టు దిశానిర్దేశం మేరకు విచారణ జరిపి దానంతో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే ఈ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించాయి. ఈ క్రమంలోనే ఏలేటి మహేశ్వర్ రెడ్డి లేవనెత్తిన ఒక సాంకేతిక అంశం ఇప్పుడు దానం నాగేందర్‌కు రాజకీయంగా పెను గండంగా పరిణమించింది. ఇది కేవలం పార్టీ ఫిరాయింపు మాత్రమే కాకుండా, ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించడమేనని ఆయన కోర్టు ముందు బలంగా వాదిస్తున్నారు.

ఏలేటి తన పిటిషన్‌లో పేర్కొన్న అంశాల ప్రకారం, దానం నాగేందర్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతూనే, అధికారికంగా రాజీనామా చేయకుండా లేదా అనర్హత వేటు పడకుండా మరో పార్టీ తరపున



ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేయడం చట్టవిరుద్ధమని ఆయన నొక్కి చెప్పారు. ఇది ఓటర్లను వంచించడమే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పిటిషనర్ వాదన. ఈ సున్నితమైన అంశాన్ని హైకోర్టు సీరియస్‌గా తీసుకోవడంతో దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం ఒక ప్రజాప్రతినిధి తన ప్రాథమిక సభ్యత్వానికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన వ్యక్తి, ఆ పార్టీకి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ పార్టీ 'బిఫామ్' మీద ఎంపీగా పోటీ చేయడం అంటే అది నేరుగా ఫిరాయింపు కిందకే వస్తుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయాన్ని ఏలేటి తన పిటిషన్‌లో ప్రస్తావిస్తూ, గతంలో ఇతర రాష్ట్రాల్లో ఇటువంటి ఉదంతాలు జరిగినప్పుడు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఉదాహరణగా చూపారు. దీంతో ఈ కేసులో కోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు ధర్మాసనం, దానం నాగేందర్‌తో పాటు అసెంబ్లీ సెక్రటేరియట్‌కు కూడా నోటీసులు జారీ చేయడం గమనార్హం. ఒక పార్టీ తరపున అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహిస్తూ, మరో పార్టీ గుర్తుపై ఎలా పోటీ చేస్తారని న్యాయస్థానం సూటిగా ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. స్పీకర్ కార్యాలయం నుంచి వచ్చే వివరణ మరియు దానం ఇచ్చే సమాధానం ఈ కేసు గమనాన్ని నిర్ణయించనున్నాయి. ఒకవేళ కోర్టు దీనిని తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణిస్తే, ఆయన ఎమ్మెల్యే పదవికి ముప్పు వాటిల్లే అవకాశం మెండుగా కనిపిస్తోంది.

రాజకీయాల్లో సీనియర్ నేతగా పేరున్న దానం నాగేందర్, గతంలో అనేకసార్లు పార్టీలు మారినప్పటికీ ఈసారి ఎదుర్కొంటున్న సవాలు మాత్రం భిన్నమైనది. గతంలో కేవలం పార్టీ మారడంపైనే చర్చ జరిగేది, కానీ ఇప్పుడు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఎన్నికల్లో పోటీ చేసిన తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ విషయాన్ని అత్యంత పకడ్బందీగా న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లడంతో, దానం తరపు న్యాయవాదులు దీనిని ఎలా ఎదుర్కొంటారో చూడాలి. ఇది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన సమస్య కాకుండా, భవిష్యత్తులో ఫిరాయింపులకు పాల్పడే నేతలకు ఒక హెచ్చరికలా మారే అవకాశం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపులు కొత్తేమీ కాకపోయినా, ఈసారి న్యాయస్థానాలు కఠినంగా వ్యవహరిస్తుండటం విశేషం. గత పదేళ్లలో జరిగిన అనేక ఫిరాయింపులపై స్పీకర్లు నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేశారనే విమర్శలు ఉన్నాయి. అయితే ఇప్పుడు కోర్టులు గడువు విధించడం, వరుసగా నోటీసులు జారీ చేయడం చూస్తుంటే పరిస్థితి మారుతున్నట్లు కనిపిస్తోంది. దానం నాగేందర్ కేసులో హైకోర్టు తీసుకునే నిర్ణయం మిగిలిన తొమ్మిది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల పైన కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే అందరి కళ్లు ఇప్పుడు హైకోర్టు వెలువరించే తదుపరి ఆదేశాలపైనే ఉన్నాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. దానం నాగేందర్ వంటి కీలక నేతపై అనర్హత వేటు పడితే, అది ప్రభుత్వ ప్రతిష్టపై ప్రభావం చూపుతుందని అధికార పార్టీ ఆందోళన చెందుతోంది. ఒకవేళ ఉప ఎన్నిక వస్తే ఖైరతాబాద్‌లో మళ్లీ గెలవడం సవాలుతో కూడుకున్న పని అని భావిస్తున్నారు. అందుకే ఈ చిక్కుముడిని విప్పేందుకు న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తున్నారు. అయితే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ దానంపై వేటు పడేలా చేస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల నియోజకవర్గంలో కూడా రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. దానం నాగేందర్ వాదన ప్రకారం, తాను ప్రజల కోసమే పార్టీ మారానని, సాంకేతిక అంశాలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులు తనను ఇబ్బంది పెడుతున్నారని చెబుతున్నారు. తన ఎంపీ పోటీ విషయంపై పార్టీ అధిష్టానంతో చర్చించాకే నిర్ణయం తీసుకున్నానని, చట్టపరంగా తాను ఎక్కడా తప్పు చేయలేదని ఆయన ధీమాగా ఉన్నారు. కానీ రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ఫిరాయింపు అనేది స్పష్టమైన నేరమని, దానికి ఈ ఎంపీ పోటీ అనే అంశం మరింత బలాన్ని చేకూరుస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఇద్దరి వాదనల మధ్య న్యాయస్థానం ఇచ్చే తీర్పు చారిత్రాత్మకం కానుంది. ప్రస్తుత సమాచారం ప్రకారం, హైకోర్టు ఈ కేసును త్వరగా తేల్చాలని భావిస్తోంది. అసెంబ్లీ సెక్రటేరియట్ నుంచి రికార్డులను పరిశీలించి, దానం నామినేషన్ పత్రాలను కూడా విశ్లేషించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక దానం ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత ఉందో లేదో కోర్టు తేల్చి చెబుతుంది. ఒకవేళ వ్యతిరేక తీర్పు వస్తే అది రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తుంది. ఇది దానం నాగేందర్‌కు ఒక అగ్నిపరీక్ష లాంటిదే. ఆయన ఇన్నేళ్ల రాజకీయ అనుభవం ఈ గండం నుంచి గట్టెక్కిస్తుందా లేక న్యాయస్థానం మొట్టికాయలు వేస్తుందా అనేది వేచి చూడాల్సిందే.

## కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**మహబూబాబాద్,విశాలభారతి :** మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ గౌరవ శ్రీమతి స్నేహ శబరీష్‌ని మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లాలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులు బయోమెట్రిక్ నమోదు మరియు ఫోటో తీసుకునే ప్రక్రియలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు ఎక్కువగా ఉండటంతో కార్మికులు పని చేయడంలో ఆటంకాలు కలుగుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి కార్మికులకు సౌలభ్యం కల్పించాలని అధికారులను కోరారు. అదేవిధంగా, ఎస్సారెస్పీ (ఎస్ ఆర్ ఎస్ పి) ద్వారా నీటి విడుదలను వేగవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోకుండా సమయానికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల జీవనాధారం పంటలపై ఆధారపడి ఉండటంతో, నీటి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇక తన మంత్రిత్వ కాలంలో మంజూరు చేసిన సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు, కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, వెంటనే బిల్లులు క్లియర్ చేయాలని అధికారులను కోరారు. జిల్లాలో భూ సమస్యలు కూడా అధికంగా ఉన్నాయని, సాగులో ఉన్న రైతుల పేర్లకు భూములు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. భూములపై స్పష్టత లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మన్యు ప్యాట్నీ, నెహ్రూ నాయక్, అల్లూరి కిషోర్ వర్మ, బాధే నాగయ్య, భద్రు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు నిత్య చైతన్య స్ఫూర్తి భగత్సింగ్ త్యాగం

- **భగత్ సింగ్ స్ఫూర్తితో అమెరికా యుద్ధోన్మాదం పై పోరుసల్పాలి**
- **నల్లు సుధాకర్ రెడ్డి ఏ ఐ వై ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు**




**కురవి విశాలభారతి:** నాటి నుండి నేటి వరకు యువతకు నిత్య చైతన్య స్ఫూర్తిగా నిలుస్తున్న భగత్ సింగ్ త్యాగాల స్ఫూర్తిగా అమెరికా సామ్రాజ్యవాదంపై పోరు సల్పాలని మాజీ ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 95 వ వర్ధంతి సందర్భంగా ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ ల ఆధ్వర్యం లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారతావని విముక్తి కోసం ఆంగ్లేయ సామ్రాజ్యవాదుల పై తిరుగుబాటు బావుట ఎగురవేసి, మొక్కవోని ధైర్య సాహసాలతో 23 సంవత్సరాల యవ్వనంలోనే ఉరికంబం ఎక్కి, దేశ స్వతంత్రం కోసం లక్షలాదిమంది యువకులను పాల్గొనే విధంగా స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. నేటికీ భగత్ సింగ్ రాజ్ గురు సుక్ దేవ్ ల త్యాగాలు యువతకు ఉత్తేజాన్ని, స్ఫూర్తినిస్తూ, మతోన్మాద, ఫాసిస్ట్, సామ్రాజ్యవాద శక్తులపై తిరగుబాటుకు ప్రేరణగా నిస్తున్నాయని, ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా, దేశాల సార్వభౌమత్వ రక్షణకై యువత ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు తురక రమేష్, పోలేపాక వెంకన్న, బుడమ వెంకన్న దూదికట్ల సారయ్య, బొల్లం విజయ్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సాయికుమార్, సంగెం జిన్నీ, బొడ్డు ఉదయ్ తేజ్, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, దుంద్ర వేణు, బయ్య జెస్సు, బాలు, నాగరాజు, సుమంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- **సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్**



**దేవరుప్పుల, విశాలభారతి:** మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈరోజు కమ్యూనిటీ ప్యూర్ వాటర్ ప్లాంటు నిర్మాణం చేసి పిల్లలందరూ సురక్షితమైన నీరును త్రాగాలన్న ఉద్దేశంతో పాఠశాలలోని బడి పిల్లలకి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు రాగి స్వప్న అధ్యక్షత వహించగా గౌరవ అతిథిగా దేవరుప్పుల మండల గ్రామ పంచాయతీ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలందరూ ప్లాస్టిక్ రహిత సమాజానికి నాంది పలకాలని, ప్లాస్టిక్ వాడకం వలన నేటి సమాజంలో క్యాన్సర్ రావడానికి కారణభూతం అవుతుందని, అలాగే సమాజంలో పెస్టిసైడ్స్ మందులు వాడకం వలన సురక్షితమైన జలనిధి కేంద్రాలు కలుషితమై ఫ్లోరైడ్ నిధి క్షేత్రాలుగా ఏర్పడి పుట్టిన పసి గుడ్డు నుండి పెద్దవాళ్ల వరకు అనేక రకాల సీజనల్ వ్యాధులకు గురవుతూ కాళ్ళ కీళ్ల నొప్పులతో, నానా రకాల అనారోగ్యాలకు గురవుతూ ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారని, ఈ క్లోరైడ్ రైతు సమాజం నుండి, ప్లాస్టిక్ రహిత సమాజం నుండి మనం ముందుకు రావాలంటే ప్లాస్టిక్ ను వ్యతిరేకిద్దాం సురక్షితమైన మాత్రమే త్రాగుదాం అని తెలిపారు. కమ్యూనిటీ ఈ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలందరికీ స్టీల్ వాటర్ బాటిల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ చెవిటి శ్రీను, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శ్యామల, చింత ప్రవీణ్, కమలాకర్, తదితరులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అభయ హస్తం కాస్త బస్మాసుర హస్తమయింది

- **తీగల దయాకర్ గౌడ్**



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20262027 బడ్జెట్ అంకెల గారిడని, అది అభయహస్తం కాదు బస్మాసుర హస్తం అయిందని, అభయహస్తంలో 6 గ్యారెంటీ లు, 13 పథకాలు, 420 హామీలు ఉన్నాయని, దింతో పాటు బీసీ డిక్లరేషన్, ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లు అమలుకాకపోగా రెండు లక్షల రూపాయల రుణమాఫీ సగం మందికి కూడా కాలేదని, మహిళలకు ఫ్రీ బస్సు పెట్టి మగవారికి డబల్ చేసి దోచుకుంటున్నారని, ఇవన్నీటికి ఈ బడ్జెట్ లో నిధులు కేటాయిస్తారని ఎదురుచూడగా మొండి చేయి చూపించారని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో బీసీ లను ఆశల పల్లకిలో తీసుకెళ్లి, బీసీ లకు హామీలు అమలు చేయకపోగా బీసీలను రాజకీయ రిజర్వేషన్లు పేరిట మొదటి సంవత్సరం రోడ్ల మీద ధర్నాలు, రాస్తారోకోలతో రాజకీయ ఆర్థిక సామాజికంగా పైకి తీసుక పోతామని మైండ్ గేమ్ ఆడి, ఈ సంవత్సర బడ్జెట్ లో గుండు సున్నా చూపించారని, రానున్న ఎన్నికలలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, యూత్ అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొల్లూరి సోమయ్య, జోగు సోమనర్సయ్య, కారుపోతుల బిక్షపతి, కూతటి నర్సింహా, శ్రీనివాస్ రెడ్డి, సుడిగేల హన్మంత్, తోటకురి కిష్టయ్య, యాదగిరి, కార్యకర్తలు, యూత్ సోషల్ మీడియా నాయకులుఉన్నారు.

## దివిస్ సహకారంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- **ప్రారంభించిన సుర్వి మల్లేశం గౌడ్ సర్పంచ్**
- **వెంకటయ్య వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని అంకిరెడ్డి గూడెం గ్రామంలో దివిస్ లేబరేటరీస్ వారి సహకారంతో 98 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సిసి రోడ్డు కు సంబంధించిన పనులకు అంకిరెడ్డి గూడెం గ్రామ సర్పంచ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సుర్వి మల్లేశం గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మరియు దివిస్ లేబరేటరీ మేనేజర్ పెండ్యాల సుధాకర్ కలిసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. తదనంతరం దివిస్ సహకారంతో 21,69,225/ అంచనా వేయంతో నిర్మాణం పనులు పూర్తి చేసుకున్న మహిళా సంఘం భవనాన్ని ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వలందాసు మహేష్ గౌడ్, పాలకవర్గ సభ్యులు బత్తుల అనుష మహేష్ గౌడ్, పాలెం వెంకటేష్ గౌడ్, ముద్దం లింగస్వామి గౌడ్, దొడ్ల అందాలు శెట్టయ్య గౌడ్, దండుగల వెంకటేష్, బొమ్మని శ్రావణి స్వామి గౌడ్, మాజీ సర్పంచులు మరియు మాజీ వార్డు సభ్యులు, మహిళా సంఘాల అధ్యక్షులు సభ్యులు సిఎస్ఆర్ విభాగం దివిశ్లాబరేటరీస్ లిమిటెడ్ మరియు వివిధ పార్టీల రాజకీయ నాయకులు గ్రామ పెద్దలు యువకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

**కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాలు**



**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సవివరంగా విని సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పరిష్కరించాలని స్పష్టంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో (స్థానిక సంస్థలు), కె. అనిల్ కుమార్ (రెవెన్యూ), అలాగే రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. గూగుల్ మీట్ ద్వారా ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్ళు, ప్రజావాణి దరఖాస్తులను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, కార్యాలయాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీతనంతో సేవలు అందించడం ప్రతి అధికారుల బాధ్యత అని తెలిపారు. వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, ప్రత్యేక అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు. కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని, త్రాగునీరు, దుస్తులు, ఇతర సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ప్రతి వసతి గృహంలో ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేసి, దాని తాళం సంబంధిత అధికారుల వద్ద ఉండాలని ఆదేశించారు. అలాగే, మెనూ అమలును గూగుల్ ఫోటోలు, జియోట్యాగింగ్ ద్వారా నమోదు చేయాలని, ఆర్బిఎస్కె వైద్య శిబిరాల ద్వారా విద్యార్థులు, వంట సిబ్బందికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు జరగకుండా నాణ్యమైన ఆహారం అందించడంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులలో ఇనుగుర్తి మండలానికి చెందిన ఆవుల పద్మ తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిలిచిపోయిందని న్యాయం చేయాలని కోరగా, శనిగపురం గ్రామానికి చెందిన ఉప్పలయ్య భూమి ఆన్‌లైన్ చేసి పాసుపుస్తకం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పర్వతగిరి గ్రామానికి చెందిన వెంకటాద్రి వికలాంగుల పెన్షన్ కోసం అభ్యర్థించగా, గార్ల మండలానికి చెందిన సుందర్ సి.ఎస్.సి కేంద్రం అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ రోజు ప్రజావాణిలో మొత్తం 146 దరఖాస్తులు స్వీకరించగా, వాటిని సంబంధిత శాఖలకు పంపించి తక్షణ పరిష్కారానికి ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

**పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఐపీఎస్**

**నిజామాబాద్, విశాలభారతి:** మన దేశ స్వాతంత్రం కోసం పోరాడి తమ ప్రాణాలను సైతం నవ్వుతూ వదులుకున్న ఎందరో మహనీయుల త్యాగాలను భారతీయులందరూ ప్రతినిత్యము స్మరించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఐపీఎస్ అన్నారు. మార్చ్ 23 నవ యువకులైన దేశభక్తులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ ల ప్రాణత్యాగానికి గుర్తుగా సమర్పణ దివస్ కార్యక్రమాన్ని కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ కులాలు, మతాలు ప్రాంతాలు వేరువేరుగా ఉన్నప్పటికీ భారతీయులందరూ ఒకే తల్లి బిడ్డల్లాగా కలిసి ఉండటమే మన స్వతంత్ర సమరయోధుల యొక్క జీవిత ఆశయమని గుర్తు చేశారు, ప్రాణ త్యాగానికి మించిన గొప్ప త్యాగం ఇంకేది ఉండదని అలాంటిది వేలాదిమంది స్వాతంత్ర సమరయోధులు తమ ప్రాణాలను ఈ దేశం కోసం వదిలిపెట్టారని ఆయన తెలిపారు. నవ యువకులుగా ఉన్న అతిపిన్న వయసు గల యువకులు భగత్ సింగ్ మరియు అతని స్నేహితులు రాజ్ గురు, సుఖదేవ్ ఒరేయ్ కొయ్యలను సైతం నవ్వుతూ ముద్దాడి మెడలో వేసుకున్నారని తమ చివరి కోరిక ఏమిటి అంటే భారతమాతకు జై అని కలిసి నినదించాలని అన్నట్టుగా మనకు చరిత్ర పుస్తకాలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనురాధ, కళాశాల సిబ్బంది మరియు యువతి యువకులు పాల్గొన్నారు.




## కీసరలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి వ్యక్తి మృతి

**కీసర,విశాలభారతి :** కీసర పోలీస్ స్టేషన్ పరిధి ఔటర్ రింగ్ రోడ్డు వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. AP 39 WP 1058 చెత్త లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ నుండు ప్రాణం బలైంది. బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామానికి చెందిన రవీందర్ 54 సం"లు ద్విచక్ర వాహనంపై చక్రి పురంలోని ఇంటికి వెళ్తుండగా కీసర ఔటర్ రింగ్ వద్ద లారీ వెనుక టైర్ల కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటన స్థలం నుండి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారైయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కి తరలించి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన. రవీందర్

## బీసీలకు లక్ష కోట్లు ఇస్తామని బడ్జెట్లో అన్యాయం




**ఆర్మూర్ ,విశాలభారతి:** భారత రాష్ట్ర సమితి నందిపేట్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్లో తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా బీసీలకు సబ్బండ వర్గాలకు చేసిన అన్యాయాన్ని వివరిస్తూ, విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు మచ్చర్ల సాగర్ మాట్లాడుతూ బీసీలకు లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పి బడ్జెట్ లో మొండి చేయి చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లలో అన్యాయం చట్టబద్ధమైన పదవులలో అన్యాయం ఆఖరికి బడ్జెట్లో కూడా అన్యాయం జరిగిందని అన్నారు. ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి సంక్షేమం మరచి అభివృద్ధిని అటకెక్కించారని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మహిళలకు వృద్ధులకు ,యువకులకు, విద్యార్థులకు కార్మిక కర్షకులకు తీవ్ర అన్యాయం చేసిందని ఈ బడ్జెట్ అంకెల గారడి చేసి ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు బాబు రాజ్, రామారావు, మురళి సీనియర్ నాయకులు దారం సురేష్ ,తాటికాయల సుభాష్, పిప్పర శ్రీనివాస్ ,గణేష్, పోశెట్టి, దేవన్న, సంతోష్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్ బాల్ శిక్షకుని నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశి రామ్ నాయక్**



**మహబూబాబాద్, విశాలభారతి:** జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కొత్తగూడ మోడల్ క్రీడా పాఠశాల (బాలుర)లో బాస్కెట్ బాల్ శిక్షకుని ఖాళీ స్థానం భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు దేశీరాం తెలిపారు. ఈ నియామకం అవుట్‌సోర్సింగ్ విధానంలో చేపడతారని పేర్కొన్నారు. ఈ పదవికి అభ్యర్థులు భారత క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలోని నేతాజీ సుభాష్ జాతీయ క్రీడా శిక్షణ సంస్థ, పాటియాలాలో కనీసం ఒక సంవత్సరం శిక్షణ పట్టా పొందివుండాలని లేదా విశ్వవిద్యాలయ మంజూరి సంఘం గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి క్రీడా శిక్షణలో పీజీ డిప్లొమా పట్టా పొందివుండాలని తెలిపారు. అభ్యర్థులను మౌఖిక పరీక్ష, ప్రాయోగిక పరీక్ష మరియు ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారని వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమై 30వ తేదీ వరకు కొనసాగుతుందని, ఏప్రిల్ 6వ తేదీన మహబూబాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో తమ దరఖాస్తులను మహబూబాబాద్ గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలోని ప్రధాన శిక్షణ మరియు వనరుల కేంద్రానికి సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9492440710 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ఆశా వర్కర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



**ఆర్మూర్, విశాలభారతి:** ఆశ వర్కర్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సోమవారం మెడికల్ ఆఫీసర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష మాట్లాడుతూ లెప్రసి బిల్లులు గత రెండు మూడు సంవత్సరాల నుండి పెండింగ్ ఉండడం వలన ఇబ్బందులకు గురవుతున్నామని , జాబ్ చాట్ లో ఉన్న పనులను మాత్రమే చేయించాలని కోరారు. అదేవిధంగా పని భారం తగ్గించి 18500 వేతనాన్ని పెంచాలని లేదంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షురాలు సహారాబాను, ప్రధాన కార్యదర్శి కొండూరు మీనా, వీణ, సుజాత ఉన్నారు.

## దళిత బహుజన సామాజిక సంఘాల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి

**తిరుమలగిరి, విశాలాభారతి :** తిరుమలగిరి మండల కేంద్రం లో తెలంగాణ చౌరస్తా నందు భగత్ సింగ్ తొంబై అయిదవ వర్ధంతి ని దళిత బహుజన సామాజిక సంఘాల ఆధ్వర్యంలో సామజిక తెలంగాణ మహా సభ రాష్ట్ర అధ్యక్షులు కొత్తగట్టు మల్లయ్య నిర్వహించారు. ఈ కార్యక్రమం లో బీసీ నాయకులు మాజీ సర్పంచ్ నాగుల వెంకన్న, పులిమామిడి సోమన్న, చేను శ్రీనివాస్, పోరెళ్ల లక్ష్మయ్య, నల్లగిరి రమేష్, పరుచూరి కొండ స్వామి, జంపాల మల్లయ్య, కళ్ళాట్లపల్లి రాములు, సామల రమేష్, నిమ్మల వీరాస్వామి, పత్తెపురం యాదగిరి, కందుకూరి కృష్ణ, బాకీ శ్రీనివాస్, వారణాసి మురళి, కళాశ్రీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఓబీసీ సెల్ చైర్మన్ ను సన్మానించిన నరేందర్ గౌడ్



**నిజామాబాద్, విశాలభారతి:** హైదరాబాద్ గాంధీభవన్లో ఓబిసి సేల్ చైర్మన్గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ ను నిజామాబాద్ జిల్లా ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజరాజ నరేందర్ గౌడ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజరాజ నరేందర్ గౌడ్ ఓబీసీల సమస్యలు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తనను ఎల్లవేళలా కలిసి తమ సమస్యలు వివరించితే పరిష్కారము చేస్తానని అన్నారు.

## బిజెపి నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**నిజామాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన సోమవారం రోజు ఉదయం జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న సమయాన కలెక్టరేట్ ముట్టడికి హాజరు కాకుండా అదుపులోకి తీసుకున్న ముప్కాల్ పోలీసులు.. అదుపులో ఉన్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేష్, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అమరవీరుల దినోత్సవం




**ఆర్మూర్ ,విశాలభారతి:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నందిపేట్ లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో " అమరవీరుల దినోత్సవం(షహీద్ దివస్) "సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటం కేవలం రాజకీయ పోరాటంతోనే కాదు లక్షలాది మంది విప్లవకారుల ప్రాణ త్యాగాలతోనూ ముడిపడి ఉంది. ఎంతో మంది వీరులు నిస్సంకోచంగా, తృణప్రాయంగా భరతమాత కోసం ప్రాణాలను అర్పించారు. భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు.. ఈ ముగ్గురూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భరతమాత కోసం పోరాడిన మహావీరులు. వీరి పేర్లు వింటేనే భారతీయుల రక్తం దేశభక్తితో ఉప్పొంగిపోతుంది. అలాంటి దేశభక్తులను ఉరి తీసిన రోజు నేడే. 23 మార్చి, 1931న అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం వారిని ఉరితీసింది. 17, డిసెంబర్ 1928న బ్రిటన్ అధికారి శాండర్స్‌ను హత్య చేయడం, పార్లమెంట్ లో బాంబులు వేయడం వంటి కారణాలను చూపి ముగ్గురినీ ఉరితీశారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా ఆ రోజును అమరవీరుల దినోత్సవం(షహీద్ దివస్)గా జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజ్ కుమార్, ఎన్ ఎస్ ఎస్ పి ఓ లక్ష్మణ్ శాస్త్రి, ఏవో తులసి రామ్,విభాగాధిపతులు కిషోర్, లావణ్య, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమావేశం




**సికింద్రాబాద్, విశాలభారతి:** 12 సంవత్సరాల తెలంగాణ ఉద్యమకారుల పరిస్థితి సమాలోచన సమావేశం తెలంగాణ ఉద్యమ సంఘాల సమన్వయ వేదిక సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగింది.ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లూరి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



**సికింద్రాబాద్, విశాలభారతి:** బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. వసంత పంచరాత్రోత్సవంలో భాగంగా 5వ రోజు శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి ప్రీతిగా చండీ హోమము ,దుర్గా మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం కనుల పండుగ జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ధరణిధర్, ఆలయ అర్చకులు శ్రీనివాస శాస్త్రి, సాయి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్రా యాత్రకు 50 మందికి పైగా భక్తుల ప్రయాణం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సౌదీ ఎయిర్‌లైన్స్ విమానంలో ఉమ్రా యాత్రకు భక్తులు సోమవారం బయలుదేరారు. ఆల్ ఇండియా విజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ యాత్రకు 50 మందికి పైగా ఇస్లామిక్ మతస్థులు వెళ్లారు. ఈ యాత్రలో తెలంగాణ రాష్ట్రంలోని తాండూర్, వికారాబాద్, హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు ప్రాంతానికి చెందిన భక్తులు పాల్గొన్నారు. యాత్రికులను వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా విజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ, మక్కా, మదీనా వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించడం ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం కనీసం ఒకసారి అయినా ఈ పవిత్ర స్థలాలను దర్శించుకోవాలని సూచించారు. మక్కా, మదీనాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ద్వారా దైవచింతనతో పాటు మనసుకు ప్రశాంతత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ యాత్ర 15 రోజుల పాటు కొనసాగుతుందని, ఈ సమయంలో భక్తులు ఉపవాస దీక్షతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ డివిజన్ పరమారెడ్డి హిల్స్ ఫేజ్ 2లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. అనుమతులు ఒక విధంగా తీసుకుని నిర్మాణాలు వేరే విధంగా చేపడుతున్న మూడు భవనాలను కూల్చివేయగా, మరో రెండు భవనాలను సీజ్ చేశారు.స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించి, స్టిల్ట్ ప్లస్ టు అనుమతులు తీసుకుని స్టిల్ట్ ప్లస్ ఫోర్‌తో పాటు పెంట్ హౌస్ నిర్మిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే కూల్చివేత చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అత్తాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుధాకర్ మాట్లాడుతూ, జోనల్ కమిషనర్ మరియు డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు తెలిపారు. భవన నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూల్చివేతలలో సెక్షన్ ఆఫీసర్ విశాల్ రెడ్డి, చైన్ మెన్‌లు సతీష్, బాల్ రాజు, నాక్ ఇంజనీర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# హైదర్ నగర్ చెరువులో కుప్పలు తెప్పలుగా గుర్రపు డెక్క

- **తొలగింపులో అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**
- **పశువులకు తాగునీరు దొరక్క ఇబ్బందులు**
- **స్థానికుల కంటి మీద కునుకు కరువు**




**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

నగర చెరువులు గుర్రపు డెక్కతో కమ్ముకుని మురికి కూపాలుగా మారుతున్నాయి. మురుగు నీటి ప్రవాహంతో చెరువుల్లో గుర్రపు డెక్క విస్తరిస్తూ, దోమలకు ఆవాసంగా మారుతోంది. ఫలితంగా సమీప కాలనీల ప్రజలు ఇబ్బందులుపడు తుండగా,మత్స్యకారుల జీవనోపాధిపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. సమస్య పరిష్కారంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదర్ నగర్ డివిజన్ లోని అలీ తలాబ్ చెరువు లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీలు, అపార్ట్మెంట్ ,బస్తీల మురుగు నీరు నేరుగా చెరువుల్లోకి చేరుతోంది. దీంతో నీటి నాణ్యత పడిపోగా, ఆక్సిజన్ స్థాయిలు తగ్గి చేపలు, జలజీవులు మృతి చెందుతున్నాయి. గుర్రపు డెక్క విస్తరించడంతో చేపల వేట కష్టమవుతూ మత్స్యకారులు నష్టపోతున్నారు. పశువులు కూడా చెరువుల్లో నీళ్లు తాగలేక ఇబ్బందులు పడుతున్నాయి.చెరువులు మురికి కూపంలా తయారయ్యాయి. మురుగు నీటితో చెరువులు నిండి పోవడంతో గుర్రపు డెక్క పెరుగుదలకు అనువుగా మారాయి. మొక్క చెరువు మొత్తం అల్లుకుపోతుండడ తో.. ఆ ఆకులకు దోమలు ఆవాసం గా మార్చుకుంటున్నాయి. సాయంత్రంకాగానే.. గుంపులు గుంపులు గా సమీప కాలనీ, బస్తీ లపై దండయాత్ర చేస్తున్నాయి. ఈ సమస్యకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ) ఆధునిక పద్ధతుల్లో పరిష్కారం చూపడంలేదన్న విమర్శలు విని పిస్తున్నాయి.

**గుర్రపు డెక్క నివారణేదీ..?**

గుర్రపు డెక్క నివారణకు మున్సిపల్ అధికారులు పాత మూస పద్ధతులనే వాడుతున్నట్లు విమర్శలున్నాయి. గుర్రపు డెక్కను తొలగించే ఎఫ్టీసీ (ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్) యంత్రాలను ఉపయోగించడలే దని తెలుస్తోంది. డ్రోన్లతో మందును పిచికారీ చేసి గుర్రపు డెక్కను నిర్మూలించే పనులను నిలిపివేసి నట్లుప్రచారం జరుగుతోంది. పూర్వ కాలంలా.. ఎలాంటి రక్షణ లేకుండా.. కార్మికులను చెరువుల్లోకి దించుతున్నట్లు సమాచారం ఉంది. మట్టిలో ఇరుక్కొని చనిపోతుండడంతో కార్మికులు కొన్నేళ్లుగా చెరువుల్లో దిగట్లేదని సిఎంసీ సిబ్బంది తెలియజేస్తున్నారు. అమాయక ప్రజలకు అధికారులు డబ్బు ఆశగా చూపి.. కొన్ని ప్రాంతాల్లో కార్మికులతో గుర్ర పుడెక్కను తొలగిస్తున్నట్లు తెలిసింది. అయితే మురు గునీరు చెరువుల్లో కలువకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధారులు పట్టనట్లు వ్యవహారిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కనీసం చెరువుల్లో మురుగు నీరు కలిసే చోట సీవరేజీ ట్రీట్ మెంట్ ప్లాంట్లను ఏర్పా టు చేయాలి. కానీ అలా కాకుండా. చాలా చెరువుల్లో ఎక్కడో ఒక చోట సీవరేజీ ట్రీట్ మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసి మమ అనిపిస్తున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో చెరువుల్లోకి మురుగు నీరు చేరి గుర్రపు డెక్క వృద్ధి చెందుతుందని నగరవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సిఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.


ఎండి సలీం స్థానికుడు

**అధికారుల నిర్లక్ష్యం.. ఎండీ సలీం,స్థానికుడు**

గుర్రపు డెక్క వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగీ వ్యాధులు పెరుగుతున్నాయి.అధికారులు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు.సాయంత్రం అయిందంటే చాలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. తాగే నీళ్లలో వండుకునే ఆహారంలో సైతం దోమలు వచ్చి పడుతున్నాయి. అలాంటి ఆహారం తీసుకోవడంతో విష జ్వరాల బారిన పడి స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పట్టించుకొని గుర్రపు డెక్క సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

**మురుగునీటి ప్రభావంతో..**

నగరంలోని డ్రైనేజీ నీరు చెరువుల్లోకి పోతుండడంతో గుర్రపు డెక్క పెరుగుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్య బస్తీలు, కాలనీలు,అపార్ట్మెంట్లు,వ్యాపార వాణి జ్య సంస్థల నిర్వహకులు చెరువు ల్లోకి వదులుతున్నారు. దీంతో చెరువుల్లో దుర్వాసన వ్యాపిస్తోంది. తద్వారా చెరువులను గుర్రపు డెక్క కమ్మేస్తోంది. గుర్రపు డెక్క వల్ల చెరువుల్లో నీటి నాణ్యత తగ్గడంతో ఆక్సి జన్ స్థాయిలు పడిపోతున్నాయి. చేపలు, జల జీవులు చనిపోతున్నా యి. చేపల పెంపకం తగ్గిపోతుంది. మత్స్యకారులకు చేపలవేట కష్టమ వుతోంది. గుర్రపు డెక్క వల్ల చేపలు పట్టడం అడ్డంకిగా మారుతోంది. పశువులు సైతం గుర్రపు డెక్క వల్ల చెరువుల్లో నీళ్లు తాగేందుకు ఇబ్బం దులు పడుతున్నా యి. గుర్రపు డెక్క తో చెరువులన్నీ దుర్వాసనగా మారాయి. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరిం దేందుకు అధికార యంత్రాంగం మొక్కుబడిగా గుర్రపు డెక్క తొలగింపు పేరిట హడావిడి చేస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## బీజేపీ నాయకుడికి గృహ నిర్బంధం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి గారిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు పార్టీ నాయకులతో కలిసి బయలుదేరుతున్న సమయంలో ఆయనను పోలీసులు అడ్డుకుని గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిందని, కానీ ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టులతో తమను భయపెట్టలేరని, ప్రజల కోసం ఎంత దూరమైన పోరాడతామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలకు సమాధానాలు ఇవ్వలేక ప్రభుత్వం గృహ నిర్బంధాలు వంటి చర్యలకు దిగుతుందని ఆయన ఆరోపించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, తగిన సమయంలో స్పందిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో రావుల భాస్కర్, తలారి చిన్న, బబ్లూ, శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బొల్ల రామకృష్ణ, ఏన్ను శంకర్ రెడ్డి, హరినాథ్, పోప్పట్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి కోసం జాగృతి అభ్యుదయ సంఘం మౌన ప్రదర్శన




**యుద్ధం వద్దు – శాంతి ముద్దు నినాదాలతో ఇంజాపూర్–సాహెబ్ నగర్‌లో ర్యాలీ**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

ప్రపంచ శాంతి స్థాపన కోసం జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఇంజాపూర్-సాహెబ్ నగర్ డివిజన్ ప్రధాన రహదారులపై ఈరోజు మౌన ప్రదర్శన నిర్వహించారు. యుద్ధం వద్దు - శాంతి ముద్దు , అణ్వాయుధాలు కాదు, ఆకలి తీర్చే సాధనాలే ముద్దు వంటి నినాదాలతో నిర్వహించిన ఈ ర్యాలీ ప్రజల్లో విశేష చైతన్యం కలిగించింది. ప్రదర్శన అనంతరం ప్రముఖ సంఘ సేవకులు, సామాజిక విశ్లేషకులు కె.ఎల్. నరసింహారావు మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో యుద్ధాలు మానవాళికి వినాశనం తీసుకువస్తాయని అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, అలాగే ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రభావం ప్రపంచ దేశాలపై తీవ్రంగా పడుతోందని, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై దీని ప్రభావం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. గాయత్రి నగర్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. యుద్ధం వల్ల ప్రాణనష్టం, కుటుంబాల విచ్ఛిన్నం, సమాజంలో భయం మాత్రమే మిగులుతుందని, సమస్యలను సంభాషణ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. యుద్ధం కాదు, శాంతే గొప్పది అని పేర్కొన్నారు. సామాజిక శ్రేయోభిలాషి గోపాల్ దాస్ రాము మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల మధ్య ఆధిపత్య పోరాటాలకు సామాన్య ప్రజలు మూల్యం చెల్లించకూడదని, వెంటనే యుద్ధాలు ఆపాలని డిమాండ్ చేశారు. జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి కోసం, అలాగే పెట్రోల్, వంట గ్యాస్ వంటి నిత్యావసరాల కొరతను ఎదుర్కొనే పరిస్థితులపై అవగాహన కల్పించడమే ఈ మౌన ప్రదర్శన ఉద్దేశమని తెలిపారు. ప్రజల తరపున ఈ సంకేతాలను ప్రజాప్రతినిధుల ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు చేరవేయాలని, శాంతి కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాగరాజు, కె గురు, రాజు యాదవ్, పాటి రాంబాబు గౌడ్, ఉద్భవ్, అపూర్వ, శివ, రేణుక, రామకృష్ణ, రాజు గౌడ్, సీతారామయ్య, బి.శ్రీనివాస్, విష్ణు, జైపాల్ నాయక్, ఫణి కుమార్, ఓవీఆర్ కుమార్, రాజయ్య, లక్ష్మయ్య, రమేష్, రత్నశేఖర్, లోకేష్, వాసన్ రెడ్డి, శివాచారి, చందు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్**



**నిజామాబాద్, విశాలభారతి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటదివెంట పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 140 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## జన జాగరణ జాతరకు పూర్తి మద్దతు ప్రకటించిన ఇప్పలపల్లి చంద్రహాస్

**కటకం నర్సింగ్ రావు నివాసంలో మర్యాదపూర్వక భేటీ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మన ఆలోచన సాధన సమితి (మాస్) వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు నివాసంలో తెలంగాణ ప్రజా గాయకుడు, సినీ నటుడు ఇప్పలపల్లి చంద్రహాస్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాబోయే ఏప్రిల్ 19న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న జన జాగరణ జాతర కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. జన జాగరణ జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తనవంతు పాత్రను పోషిస్తానని, ఈ కార్యక్రమానికి విస్తృతంగా ప్రజలను ఆకర్షించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం సమాజంలో చైతన్యం తీసుకురావడంలో కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర కార్యదర్శి గుణగంటి చంద్రశేఖర్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య, సోషల్ మీడియా కార్యదర్శి కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర, కటకం సుప్రియ, మామిడి సతీష్, అనగంటి విష్ణు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బీసీలకు న్యాయం ఎక్కడ?

**ఆందోళన చేపట్టిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. జిల్లా, మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ప్రతి సంవత్సరం ₹20,000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఈసారి కేవలం ₹12,000 కోట్లకే పరిమితం చేయడం అన్యాయమని నాయకులు విమర్శించారు. అలాగే బీసీ సబ్ ప్లాన్ అమలు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం జనాభా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం 6 శాతం నిధులు మాత్రమే కేటాయించారని, ఇది సామాజిక న్యాయానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి గట్టి హెచ్చరికగా సోమవారం రోజు ఎల్బీనగర్ నియోజకవర్గం తెలంగాణ రాజ్యం అధికార పార్టీ నాయకులు విజయవాడ జాతీయ రహదారిపై భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్, పార్టీ నాయకులు,కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## మొయినాబాద్‌లో మెడికల్ క్యాంప్

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య.. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్వో కే.లలితాదేవి**



**మొయినాబాద్, విశాలభారతి:** ప్రజల సమస్యలకు త్వరిత పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ అధికారులు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 368 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా, అందులో మహిళలు 233 మంది, పురుషులు 135 మంది ఉన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం అదృష్టంగా భావించారు. ఇలాంటి కార్యక్రమాలను మండలంతో పాటు గ్రామ స్థాయిలో కూడా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీఎం హెచ్వో కే. లలితాదేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పూనాం, డిప్యూటీ డాక్టర్ శ్రీనివాస్, చేవెళ్ల డివిజన్ డాక్టర్ అన్నపూర్ణ, ఎంఎల్ హెచ్‌పీఎస్ డాక్టర్లు, సిహెచ్ఓలు, సూపర్వైజర్లు, మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దూబ సోనియా, వైస్ చైర్మన్ గరుగు రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆసుపత్రి సిబ్బంది మరియు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**మొయినాబాద్ మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ కళ్లెంల జగపతి**



**మొయినాబాద్, విశాలభారతి:** రైతులందరూ పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, మొయినాబాద్ మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ కళ్లెంల జగపతి పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం లోగల గోశాలలోని 89 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి ఎఫ్ఎండీ నివారణ టీకాలు మొయినాబాద్ పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని 19వ వార్డు కౌన్సిలర్ కళ్లెంల జగపతి సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశువులకు వచ్చే వ్యాధులను నివారించేందుకు రైతులందరూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో టీకాలు వేయించినట్లయితే వ్యాధులు సోకకుండా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ అహ్మద్, పశువైద్య సిబ్బంది పద్మ, ప్రసన్నకుమార్, భీంరావు, గోరేమియా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు

- ముప్పై ఆరు గ్రామ పంచాయతీలలో ఇదే దుస్థితి
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా -పట్టించు కోని అధికారులు

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని గ్రామాల్లో పచ్చదనం పెంపొందించి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై ఎండిపోయి,పాడైపోతున్నాయి. గత ప్రభుత్వంలో కెసిఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయించింది. ఇందుకోసం లక్షల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి భూమిని సమతలీకరించడం, మొక్కలు నాటడం, కంచె వేయడం, నీటి సదుపాయం కల్పించడం వంటి పనులు చేశారు. అయితే ప్రస్తుతం వాటి పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా మారింది.మండల పరిధిలోని దాదాపు ముప్పై ఆరు గ్రామపంచాయతీలలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడాల్సిన పల్లె ప్రకృతి వనాలు ఇప్పుడు పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తతో నిండిపోయి పాడుబడిన ప్రదేశాలుగా మారిపోయాయి. మొక్కలకు నీరు అందక చాలా వరకు ఎండిపోగా, కొన్ని చోట్ల తులసి కోటలో గంజాయి మొక్కలా పిచ్చి మొక్కలు విస్తరిస్తున్నాయి. సంరక్షణ లేకుండా వదిలేయడంతో వనాల చుట్టూ ఉన్న కంచెలు కూడా దెబ్బతిని నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారాయి.గ్రామాల్లో ప్రజలకు విశ్రాంతి కల్పించే స్థలంగా, పిల్లలకు ప్రకృతి మధ్యలో ఆడుకునే ప్రదేశంగా ఉండాల్సిన ఈ వనాలు ఇప్పుడు ఎవరూ అడుగు పెట్టని పాడుబడిన ప్రదేశాలుగా మారిపోయాయి. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించాలనే ప్రభుత్వ లక్ష్యం కాగితం మీదే మిగిలిపోయిందని స్థానికులు విమర్శిస్తున్నారు.పల్లె ప్రకృతి వనాల సంరక్షణ బాధ్యత గ్రామపంచాయతీలదే అయినప్పటికీ సర్పంచులు, కార్యదర్శులు, సంబంధిత అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతోంది. కనీసం నెలలో ఒకసారి కూడా పరిశీలన చేయకపోవడం, మొక్కలకు నీరు పోయకపోవడం, పిచ్చిమొక్కలను తొలగించకపోవడం వంటి కారణాలతో ఈ వనాలు పూర్తిగా నిర్జీవంగా మారుతున్నాయి. ఈ వనాల నిర్మాణానికి ఖర్చు చేసిన కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుందనే ఆవేదన గ్రామస్థుల్లో వ్యక్తమవుతోంది. ప్రజల పన్నుల ద్వారా వచ్చిన నిధులతో ఏర్పాటు చేసిన వనాలను ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం సరైనది కాదని వారు అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వనాల పరిస్థితిని పరిశీలించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించి, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి, నీటి సదుపాయం కల్పించి పల్లె ప్రకృతి వనాలను తిరిగి పచ్చగా మార్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ వనాలు పూర్తిగా నశించి కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా కావడం ఖాయమని వారు హెచ్చరిస్తున్నారు.






## హిందూ సమ్మేళనంలో జక్కిడి రఘువీర్ రెడ్డి

**జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయం అందజేత**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ ప్రాంతంలోని లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని సూర్య నగర్ కాలనీ దేవాలయ ప్రాంగణంలో సూర్య నగర్ బస్తీ హిందూ సమ్మేళన సంచాలన సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ బంధువుల ఐక్యత, భక్తి, సంస్కృతి ప్రతిబింబించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలుచేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. అలాగే నిర్వాహకుల ఆహ్వానం మేరకు కార్యక్రమంలో భాగస్వామ్యంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరపున వాగ్దానం చేసిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, ధార్మిక విలువలను మరింత బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పరిశుభ్రమైన అత్తాపూర్ కోసం సిబ్బంది ర్యాలీలు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** అత్తాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ శ్రీ సమ్మయ్య గారి ఆధ్వర్యంలో, ఈ రోజు (23032026) అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదరగూడ వార్డు, విజ్ఞాన్ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న చెత్తకు గురయ్యే ప్రదేశం (జీవీపీ) తొలగింపు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, సంబంధిత సిబ్బంది పాల్గొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే, చెత్త వాహనానికి చెత్త ఇవ్వని ఇళ్లను సందర్శించి, ప్రతి రోజూ తమ ఇంటి చెత్తను చెత్త వాహనానికి అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే, అత్తాపూర్ సర్కిల్ 20 పరిధిలోని అన్ని వార్డుల్లో సిబ్బంది ర్యాలీలు నిర్వహిస్తూ, ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సూచనలు అందిస్తున్నారు. ఈ అవగాహన కార్యక్రమం 23032026 నుండి 28032026 వరకు కొనసాగుతుంది. ప్రతి కుటుంబం తమ బాధ్యతగా భావించి, ఇంటిలో ఉత్పత్తి అయ్యే రోజువారీ చెత్తను తప్పనిసరిగా చెత్త వాహనానికి అందించి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని మనవి. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ శ్రీ సమ్మయ్య గారు, తిరుపతి గారు, ఏఈ ఆశిష్ గారు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలి

**మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



**ఎల్బీనగర్ విశాలభారతి:** హయత్ నగర్ లోని ఆటోనగర్ సెక్షన్ HMWS&SB జలమండలి కార్యాలయం మరియు ఎల్.బి నగర్ MMC జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఈరోజు ప్రజావాణిలో డివిజన్లోని టెండర్ పూర్తయి పెండింగ్లో ఉన్న భూగర్భ డ్రైనేజీ ఇన్నర్ లైన్ల పనులు మరయు వీరన్న గుట్టలో కొనసాగుతున్న C.C రోడ్డు పనులతో పాటు ఇంకా మిగిలి ఉన్న రామాలయం పక్కన వీధులలో సి.సి రోడ్డు పనులను పూర్తి చేయాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మరియు కాలనీ మహిళలతో కలిసి మాజీ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో MMC ఎల్.బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ IAS కి మరియు HMWS జలమండలి అధికారులు CGM నాగేందర్ కి,G.M మహేందర్ నాయక్ కి మరియు మేనేజర్లకు సంబంధిత అధికారులకు డివిజన్లో ఉన్న సమస్యలను క్షుణ్ణంగా వివరించి అది తొందరగా పరిష్కరించాలని కోరడంతో వారు సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర పార్టీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి నరసింహా రెడ్డి వెళ్తుండగా పోలీసులు ముందస్తు అరెస్టు చేయడంతో, కాలనీవాసులు సమస్యలైన పరిష్కరించేందుకు వెళ్ళనివ్వగలరని పోలీసువారికి విజ్ఞప్తి చేయడంతో వారితో పాటు ప్రజావాణికి వెళ్లని చెప్పే పోలీసులు వినకుండా గృహనిర్బంధనం చేయడంతో, స్వయంగా పోలీసులను మా వాహనంలో ఎక్కించుకొని HMWS జలమండలి, ఎల్.బి జోనల్ కమిషనర్ కార్యాలయానికి మరియు పలు సమస్యలపై కాలనీవాసులు ఇచ్చిన ఆహ్వానం వద్దకు కూడా పోలీసుల వెంట పెట్టుకొని మరి సమస్యలను పరిష్కరించేందుకు పోలీసులను వెంటనే తీసుకెళ్లడం జరిగింది అన్నారు.

## అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

**భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి సందర్భంగా సిపిఐ నేతల నివాళులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 3 భూ పోరాట కేంద్రంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మధు ఆధ్వర్యంలో నిర్వహించగా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులపై పోరాటం చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల త్యాగాలు అపారమని పేర్కొన్నారు. ఉరిశిక్షకు గురైనా క్షమాభిక్ష కోరకుండా తమ ప్రాణాలను త్యాగం చేసిన వీరుల పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని తెలిపారు. వారి ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలపై అధిపత్యం చెలాయిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఇరాన్పై అమెరికా మరియు ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిలిపివేసి అక్కడ శాంతి స్థాపనకు ఐక్యరాజ్య సమితి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు భగత్ సింగ్ వంటి మహనీయుల చరిత్రను పరిచయం చేసి, వారి స్ఫూర్తిని నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, బీసీసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, సిపిఐ నాయకులు సైదులు ముదిరాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, గణేష్, పేరాల గోపి, బిచ్చు నాయక్, యాదగిరి, శ్రీధర్ రెడ్డి, అశోక్, పాండు, నీల, ప్రియా, అన్నపూర్ణ, రాణి, నర్సింహా, లక్కీ, పాండు నాయక్, దశరథ్ పవర్, మధుసూర్ తదితరులు పాల్గొన్నారు.

## పలు సమస్యలపై ఫిర్యాదు చేసిన రాజన్న టీమ్

**కూకట్ పల్లి విశాలభారతి :** మూసాపేట్ మున్సిపల్ ఆఫీస్ లో జరిగిన ప్రజా వాణి కార్యక్రమంలో రాజన్న టీమ్ సభ్యులు బుల్లెట్ రవి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డీసీ ని కలిసి పలు ప్రధానమైన సమస్యలపై ఫిర్యాదు చచేశారు. ఎల్లమ్మ బండలోని కొత్త వాటర్ ట్యాంకు వద్ద రోడ్డు వేసి చాలా రోజులు అయినా కూడా పేరుకుపోయిన మట్టిని తొలగించలేదని వాటిని వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వాటర్ ట్యాంక్ నుండి ఆల్విన్ కాలనీ ఎల్లమ్మ బండ వాటర్ సప్లై అవుతున్న నేపథ్యంలో వాటర్ ట్యాంక్ వద్ద భద్రత కరువై రాత్రుల పూట గంజాయి తాగే గంజాయి బాబులు కూర్చొని గంజాయి తాగుతూ స్థానికులకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ట్యాంక్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. 24 గంటలు వాచ్మెన్ ఉంచడం ద్వారా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు తోడ్పడతాయన్నారు.ఎల్లమ్మ బండలో భారతీయ విద్యాలయ స్కూల్ వద్దగల కమ్యూనిటీ హాల్ లో కొంతమంది వ్యక్తులు తమ ఇష్టారాజ్యంగా వారి పార్టీ బ్యానర్లు కమ్యూనిటీ హాల్ లోపల పెట్టడంతోపాటు వారి సొంత వాహనాలు అక్కడ పార్కు చేసుకోవడం మిగతా 18 కాలనీల కు చెందిన వాసులకు అందుబాటులో లేకపోవడం చాలా విచారకరంగా మారిందాని కమ్యూనిటీ హాల్ అన్ని కాలనీవాసులు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని వెంటనే ఫ్లెక్సీలను తొలగించి వారి చెర నుండి కమ్యూనిటీ హాల్ కి రక్షణ కల్పించి అన్ని కాలనీ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని డీసీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రాకేష్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## మహా నియామక కార్యక్రమం ప్రారంభం

**రాజేంద్రనగర్, విశాలభారతి :**



రాజేంద్రనగర్లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన మహా నియామక కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న తొమ్మిది కళాశాలల స్నాతక, స్నాతకోత్తర మరియు డాక్టరేట్ విద్యార్థుల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వ్యవసాయం, గృహ శాస్త్రం, వ్యవసాయ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ నియామక కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో కొనసాగనుంది. సుమారు 50 ప్రముఖ సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని, పరిశోధన, అభివృద్ధి, మార్కెటింగ్ తదితర విభాగాల్లో ఉద్యోగ అవకాశాలను అందిస్తున్నాయి. విశ్వవిద్యాలయం ఇంత పెద్ద స్థాయిలో నియామక కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవం సోమవారం ఉదయం 9.30 గంటలకు నూతన విద్యా భవనంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి వ్యవహారాల డీన్ డా. వేణు గోపాల్ రెడ్డి, వ్యవసాయ డీన్ డా. ఝాన్సీ రాణి, పరిశోధన సంచాలకులు డా. బాలరామ్ మరాఠీ, వ్యవసాయ ఇంజినీరింగ్ మరియు సాంకేతిక విభాగ డీన్ డా. రమణారావు, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. గోవర్ధన్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ఇలాంటి నియామక కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. మొదటి రోజు ఐదు సంస్థల ప్రతినిధులు సంస్థల గురించి, ఉద్యోగ బాధ్యతలు మరియు అంచనాలపై అవగాహన కల్పించారు. అలాగే మొదటి రోజునే 13 సంస్థలు ఎంపిక ప్రక్రియలను ప్రారంభించాయి. విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ఈ మహా నియామక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు.

## మహిళా సంఘాల భవనానికి భూమిపూజ



**ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మాణం ప్రారంభం**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బండ రావిరాల గ్రామంలో మహిళా శక్తి, గ్రామాభివృద్ధికి మరో నిదర్శనంగా మహిళా సంఘాల (VO) భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన రూ.10 లక్షలతో ఈ భవనం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీఓ యు. శ్రీవాణి ముగ్గు వేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని, మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ పాలకవర్గం తరపున సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ దూస శంకర్, వార్డ్ సభ్యులు కన్నె భరత్, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష ప్రవీణ్, గుండ్ల భవాని శివ, కందికంటి నర్సింగ్ రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్ భాస్కర్, కారోబార్ ఏర్పుల శ్రీశైలం, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండ్ల జంగయ్యతో పాటు ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సీసీ సరస్వతి, వీవో అధ్యక్షురాలు బంగారి సుమలత, కార్యదర్శి బంగారి లత, వీవీఏలు నోముల వరమ్మ, గోద మాధవి, అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి కే. లావణ్య, కోశాధికారి బి. లావణ్య, కందికంటి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బి నగర్లో బీఆర్ఎస్ నిరసనలో
# పాల్గొన్న జక్కిడి రఘువీర్ రెడ్డి

**కాంగ్రెస్–బీజేపీ ప్రభుత్వాల వైఫల్యంపై ఆగ్రహం వ్యక్తం**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

రాష్ట్రంలో గ్యాస్ సరఫరా సమస్యలపై కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్బి నగర్ చౌరస్తాలో సోమవారం రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి ,పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సరఫరా ఎక్కడా ఆగలేదని చెబుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రం సరఫరా చేయడం లేదని ఆరోపించడం ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. ఈ పరస్పర ఆరోపణల మధ్య సామాన్య ప్రజలు, ఆటో డ్రైవర్లు, టిఫిన్ సెంటర్ యజమానులు, ఓల్డ్ ఏజ్ హోమ్స్ వంటి వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని, ఇది నిజమైతే అత్యంత అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వాల అసమర్థతను కప్పిపుచ్చడానికి కాంగ్రెస్ నాయకులు దొంగ నాటకాలు ఆడుతున్నారని, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్యాస్ సరఫరా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, బాధ్యత వహిస్తూ వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, ఉద్యమకారులు, వివిధ విభాగాల కమిటీ సభ్యులు, మహిళలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీగా పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.




## అడుగులన్నీ భద్రాద్రి రాముని వైపే

- ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాది భక్తుల కాలినడక యాత్ర
- అశ్వారావుపేట సరిహద్దుల్లో భక్తులకు అన్నదానం, వసతి ఏర్పాట్లు
- మార్చ్ 27న శ్రీ సీతారాముల కళ్యాణం కోసం భద్రాచలంకు వెల్లువలా రాక



**అశ్వారావుపేట, విశాలభారతి :** రామభక్తి ఊరూరా పరవళ్లు తొక్కుతోంది. శ్రీ సీతా రామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం సమీపిస్తుండగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు కాలినడకన భద్రాచలం వైపు తరలివస్తున్నారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, ద్వారకా తిరుమల, లక్ష్మీపురం, టీ.నరసాపురం, పుళ్ళ, భీమవరం, ఏలూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి భక్తులు "జై శ్రీరామ్" నినాదాలతో భక్తి పరవశంలో ప్రయాణం కొనసాగిస్తున్నారు. కుటుంబాల సమేతంగా, స్నేహితుల బృందాలుగా కాలినడకన సాగుతున్న ఈ యాత్రలో ప్రతి అడుగులోనూ భక్తి, ప్రతి ఊపిరిలోనూ రామనామ స్మరణ వినిపిస్తోంది. ఆంధ్ర–తెలంగాణ సరిహద్దులోని అశ్వారావుపేట వద్ద భక్తులకు భారీ స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్నదానాలు, చల్లని మజ్జిగ, తాగునీరు, విశ్రాంతి వసతులు కల్పిస్తూ స్థానికులు సేవాభావాన్ని చాటుతున్నారు. నందిపాడు వంటి గ్రామాల్లో పాఠశాలల వద్ద భక్తులు విశ్రాంతి తీసుకుంటూ రామభజనలు చేస్తూ తమ యాత్రను ఆధ్యాత్మికంగా మలుచుకుంటున్నారు. భక్తుల ఉత్సాహం, సేవకుల సహకారం కలిసి ఈ యాత్రను మహోత్సవంగా మార్చేశాయి. మార్చ్ 27న జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కళ్లారా దర్శించాలనే ఆశతో ప్రతి భక్తుడి అడుగు భద్రాచలం వైపే సాగుతోంది. ఈ రామయాత్ర భక్తి, ఐక్యత, సేవా తత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.

## ఘనంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు

- పాల్గొన్న టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్



**పాల్వంచ, విశాలభారతి:** రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ పుట్టినరోజు వేడుకలు హైదరాబాదులోని ఉప్పల్ చెంగిచెర్ల అయిన నివాసంలో సోమవారం నాయకులు, కార్యకర్తల నడుమ అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ.. దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్గా ప్రీతమ్ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. పేదల సంక్షేమం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి ఎందరికో ఆదర్శం అన్నారు.ప్రీతమ్ ఎస్సీ వర్గాలకు మరింత మేలు జరగాలని, భవిష్యత్తులో ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు , అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దుల తిరుమలరావు, సదాశివ, గంటా రమేష్, రామకృష్ణ, రాజు, ప్రవీణ్, సుధీర్, సెక్రిక్ బాబు, తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలపై ప్రయోగాత్మక నిర్ణయం

- ప్రతి సోమవారం ఉ"10 నుండి 12 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాముఖి పేరుతో ప్రజల సమస్యలు తక్షణ పరిష్కారం
- ప్రజాసమస్యల పరిష్కారమే నా ధ్యేయం- సర్పంచ్ సంధ్య




**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** అశ్వాపురం మండల పరిధిలోని మొండికుంట గ్రామపంచాయతీలో. సర్పంచ్ మద్రి సంధ్య ప్రజల సమస్యలపై ప్రయోగాత్మక నిర్ణయం చేశారు. సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా. సర్పంచ్ మద్రి సంధ్య మాట్లాడుతూ. పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. ప్రజలు నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను దరఖాస్తుల ద్వారా ఇచ్చేందుకు ఒక ప్రయోగాత్మక కార్యక్రమానికి శ్రీకరం చుట్టామని. ప్రజాముఖి అని పేరు నామకరణం చేయడం జరిగింది అన్నారు.సమస్యలను గ్రామపంచాయతీలో తిరుగుతూ తాను పరిశీలిస్తానని ఒకవేళ నా దృష్టికి రాని సమస్యలు ఏవైనా ఉంటే గ్రామ ప్రజలు నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి ప్రతి సోమవారం జరిగే ప్రజాముఖి కార్యక్రమంలో తమ దరఖాస్తులు ఇవ్వాలని ఈ సదా అవకాశాన్ని వినియోగించుకుని తమ తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసం ప్రజలకు అందుబాటులో ఉండాలని , గ్రామ ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో. పాలకవర్గ సభ్యులు. పాల్గొన్నారు.

## ఘనంగా వేణుగోపాలస్వామి వార్షికోత్సవం

- జవహర్నగర్లో వేణుగోపాలస్వామి ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా
- సింగరేణి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ దంపతుల ప్రత్యేక పూజలు
- వార్డ్ కౌన్సిలర్ ఉప్పు నాగమణి హనుమంతరావు ఆధ్వర్యంలో సన్మానం



**సత్తుపల్లి ,విశాలభారతి:** సత్తుపల్లి పట్టణంలోని జవహర్నగర్లో ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ సభ్యులు ఈ ఉత్సవాలను భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, లక్ష్మి దంపతులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వార్డ్ కౌన్సిలర్ ఉప్పు నాగమణి హనుమంతరావు ఆధ్వర్యంలో జీఎం దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో దివల పెద్దిరాజు, దివేళ, శ్రీను, రమేష్, గంధం బాబీ, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, వాసు, జి.కాశీ విశ్వనాథ్, భీమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహిళా కమిటీ సభ్యులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సెల్ టవర్ నిర్మాణం పై గ్రామస్తుల నిరసన

- జనావాసంలో సెల్ టవర్ నిర్మాణం గ్రామస్తుల ఆగ్రహం
- భయాందోళనలో అంగన్వాడి పిల్లలు,గర్భిణీ స్త్రీలు
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా అంటున్న సిడిపిఓ. రేవతి



**బూర్గంపాడు, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డి పాలెం సెల్ టవర్ నిర్మాణం వద్ద సోమవారం ఉదయం గ్రామస్తులకు, కాంట్రాక్టర్ కు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది . స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొందరు నేతలు ఒంటెద్దు పోకడలతో ఎయిర్టెల్ సెల్ టవర్ సంస్థకు కొమ్ము కాసి స్థానిక సర్పంచ్ , గ్రామస్తులకు తెలపకుండా సెల్ టవర్ నిర్మాణం చేపట్టడంతో స్థానికులు ఆందోళన చేపట్టారు. జనావాసంలో అంగన్వాడి కేంద్రానికి అతి సమీపంలో ఈ నిర్మాణం చేపట్టడం అభం, శుభం తెలియని చిన్నారుల ఆరోగ్యాన్ని క్షీణింప చేయడమే కాకుండా చుట్టు ప్రక్కల నివసిస్తున్న పలు కుటుంబాలను రేడియేషన్ బారిన నెట్టడమే అని వాపోయారు. ఈ టవర్ నిర్మాణం జరిగినట్లయితే అనారోగ్యాలతో ఆసుపత్రుల పాలవ్వక తప్పదని ఆందోళన చెందుతున్నారు. సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని గర్భిణీ స్త్రీలు, అంగనవాడి పిల్లల తల్లిదండ్రులు సిడిపిఓ రేవతికి వినతి పత్రం అందజేయగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ సరోజ మాట్లాడుతూ ఈ సెల్ టవర్ నిర్మాణం జరిగినట్లయితే ప్రతి 100 మందిలో 60 మంది స్థానికులు అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి వస్తుందని ఈ సెల్ టవర్ నిర్మాణం జనావాసంలో కాకుండా కొంత దూరంలో నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను వేడుకుంటూ, కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.సెల్ టవర్ నిర్మాణానికి కొమ్ముకాస్తున్న కొందరు నేతలపై సర్పంచ్ మరియు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భగత్ సింగ్ స్ఫూర్తిని నేటి యువతరం కొనసాగించాలి

- ఘనంగా యువ కిశోరం భగత్ సింగ్ 95 వ వర్ధంతి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



**పాల్వంచ, విశాలభారతి:** స్వాతంత్ర సమరయోధుడు బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన యువ కిశోరం షాహిద్ భగత్ సింగ్ 95 వ వర్ధంతి స్థానిక అంబేద్కర్ సెంటర్లో సిపిఎం పట్టణ కార్యదర్శి పి తులసీ రామ్ అధ్యక్షతన,ఘనంగా నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు అనంతరం మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారి దోపిడీకి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం చిన్న వయసులోనే తన సహచరులు రాజగురు, సుఖదేవ్ తో కలిసి ఎన్నో పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తిగా దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వారి స్ఫూర్తిని నేటి యువతరం కొనసాగించాలని అదే భగత్ సింగ్ కి మనమిచ్చే నివాళి అని అన్నారు సామ్రాజ్యవాదం మరొకసారి అమెరికా నాయకత్వంలో విస్తరిస్తా ఉందని ఇందులో భాగమే ఇరాన్ పై ఇజ్రాయిల్ తో కలిసి యుద్ధం చేస్తున్నారని వెనిజులా పై దాడి చేసి అధ్యక్షుడి కుటుంబాన్ని కిడ్నాప్ చేసే నీచమైన చర్యలకు పాల్పడ్డారని ఆయా దేశాల సంపదపై కన్నేసిన సామ్రాజ్యవాదులు చిన్నపిల్లలతో సహా మహిళల్ని వేలాది మంది ప్రజల్ని చంపుతున్నారని ఈ యుద్ధం వల్ల ప్రపంచ ప్రజలపై ధరల ప్రభావం తీవ్రంగా పడుతుందని ఇంత జరుగుతున్న భారత ప్రధాని నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో యువతీ యువకులు భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు కే సత్య ఎస్ కే నిరంజన్ వి సత్యవాణి వింజ రాములు ఎస్.కె రెహమాన్ హమాలి గట్టయ్య యాకూబ్ విష్ణు సోమయ్య వెంకీ తదితరులు పాల్గొన్నారు

# సేవా కార్యక్రమాలతో ప్రత్యేకత చాటిన నాయకుడు

- ఆపదలో ఆదుకునే మనసు - సేవలో ముందుండే నాయకత్వం
- ఘనంగా సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ జన్మదిన వేడుకల



**విశాలభారతి:** కరకగూడెం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు మహిళలు యువకులు అభిమానులు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ కి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేయించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మరియు సిబ్బందికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, దాన ధర్మాలు మరియు ఆర్థిక సహాయాలతో సమాజానికి సేవ చేస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండి ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి ప్రజలకు ఇంకా ఎక్కువ మేలు చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్‌సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షులు చౌలం కేశవరావు , కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత , తాటిగూడెం ఉప సర్పంచ్ గాంధర్ల రామనాథం , మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ బండి వెంకటేశ్వర్లు ,మండల నాయకులు గొగ్గలి రవి , ముంజాల సాయిబాబా ,షేక్ రఫీ , పోలేబోయిన రామారావు , చందా నాగేశ్వరరావు ,గోగ్గలి కృష్ణ , శ్యాం కుమారి ,వార్డు మెంబర్ మెంబర్ నాగమణి , మేడి శ్రీను , సోలం బాబు , సతీష్ ,సాయి, దామోదర్, కార్యకర్తలు, మహిళలు ,యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ నగరి ప్రియతమ జన్మదిన వేడుకలు

**కీసర,విశాల భారతి :** సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రియతమ్ జన్మదినం సంధర్బంగా బొడ్డుప్పల్ లోనీ ఆయన నివాసంలో మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్ ఆద్వర్యంలో శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ నాయకులు.ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అద్యక్షులు కురి మహేష్ జిల్లా కన్వీనర్ బక్కని నర్సింగరావు,కీసర జిహెచ్ఎంసి ఎస్సి ఎస్ఎల్ అధ్యక్షులు చినింగని నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా ఎస్సీ సెల్ నాయకులు

# పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

- మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్.
- రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్

**మహబూబాబాద్, విశాలభారతి:**



సోమవారం మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన వారు పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఇందిరమ్మ ప్రభుత్వమని, రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, వరి పంటనే కాకుండా వాణిజ్య పంటల వైపు రైతులను మళ్ళించే విధంగా వారికి అవగాహన కల్పించాలని అధిక లాభాలు కలిగిన ఆయిల్ పామ్, అంతర్ పంటల వేయడం ద్వారా రైతులు మరింత ముందుకు సాగుతారని తెలిపారు, మహబూబాద్ జిల్లాలో సారవంతమైన నేలలు ఉన్నాయని అందుకు తగిన విధంగా పంటలు వేయాలని ఆర్టికల్చర్, అగ్రికల్చర్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి వారికి అవగాహన కల్పించాలన్నారు, గిరిజన జిల్లా అయిన మహబూబాద్ లో క్షణిక ఆవేశంతో గడ్డి మందు సేవించి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తొందరపాటు నిర్ణయాల వలన వారి జీవితాలను అగమ్య గోచరంలో వేసుకోవడం జరుగుతుందన్నారు. గడ్డి మందు నివారణకు కోసం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ గారిని కలిసి కోరడం జరిగిందని అన్నారు, వివిధ కారణాల వలన ఆర్థికంగా నష్టపోయిన రైతు కుటుంబాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ చేదోడువాదోడుగా ఉందని అన్నారు. నాణ్యమైన విత్తనాలు ఎరువుల ఉత్పత్తికి సంబంధించి ఫర్టిలైజర్ షాపులు ప్రభుత్వం ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రైతు భరోసా, రైతు బీమా, పెట్టుబడి సహాయం, సన్నవడ్లకు 500 బోనస్, తదితర పథకాలను అందిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో డిఏఓ సరిత, హార్టికల్చర్ అధికారి మరియన్న, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, ఏ డి ఏ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# సానుభూతి యాత్ర చేపట్టిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



- ప్రజల కష్టాల్లో తోడుగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- కురవి మండలంలో సానుభూతి యాత్ర చేపట్టిన మాజీ మంత్రి
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం
- మోదుగులగూడెం, జుజూర్ తండాల్లో కుటుంబాల పరామర్శ

**కురవి, విశాలభారతి:**

డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మండలంలో ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ ముందుండే నాయకురాలిగా మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ మరోసారి తన మానవతా విలువలను చాటుకున్నారు. మండలంలోని మోదుగులగూడెం, జుజూర్ తండా గ్రామాలలో ఇటీవల మరణించిన కుటుంబాలను ఆమె స్వయంగా పరామర్శించి, వారి బాధలో భాగస్వామ్యమయ్యారు. మోదుగులగూడెం గ్రామ ఉపసర్పంచ్ ధారవత్ శరత్ తల్లి మరణించడంతో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ₹5000 ఆర్థిక సహాయం అందజేసి తన ఆదరణను చాటుకున్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ధారవత్ బాబు రావు తల్లి ధారవత్ మారోని మరణించడంతో, వారి కుటుంబాన్ని కూడా సందర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటూ, వారికి మరో ₹5000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం ప్రజా ప్రతినిధుల కర్తవ్యమని పేర్కొన్నారు. కష్టకాలంలో ఆదుకోవడం ద్వారా మాత్రమే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవచ్చని ఆమె అన్నారు. గ్రామాల్లో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే స్పందించి, బాధితులకు అండగా నిలబడటం తన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐలి నరహరి గౌడ్, బొడ శ్రీను నాయక్, మన్యు ప్యాట్నీ, బాదే నాగన్న, నెహ్రు నాయక్, అల్లూరి కిషోర్ వర్మ, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు ధారవత్ రమేష్, బాణోత్ లచ్చిరాం, శ్రీరామ్, ధారవత్ కిషన్, బాబ్రీ, వెంకన్న, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, తమ కష్ట సమయంలో వెంటనే స్పందించి వచ్చి పరామర్శించడం ద్వారా సత్యవతి రాథోడ్ నిజమైన ప్రజా నాయకురాలని మరోసారి నిరూపించారని ప్రశంసించారు. ప్రజల మధ్యే ఉండి వారి బాధలను అర్థం చేసుకుంటూ ముందుకు సాగుతున్న నాయకత్వం అరుదని వారు అభిప్రాయపడ్డారు.

# పెండింగ్ పనులు పూర్తి చేయాలి



- అధికారులను కలిసిన - కొప్పుల నర్సింహ్మా రెడ్డి
- ప్రజావాణిలో జోనల్ కమిషనర్, జలమండలి అధికారులకు వినతిపత్రం

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

హయత్ నగర్ పరిధిలోని డివిజన్‌లో టెండర్ పూర్తయి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆటోనగర్ సెక్షన్ HMWS&SB జలమండలి కార్యాలయం, ఎల్.బి నగర్ MMC జోనల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, మహిళలతో కలిసి సమస్యలను వివరించారు. డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ ఇన్నర్ లైన్ పనులు, వీరన్నగుట్టలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు, అలాగే రామాలయం పక్కన ఉన్న వీధుల్లో ఇంకా మిగిలి ఉన్న సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాలను ఎల్.బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్( IAS ) జలమండలి అధికారులు సీజీమ్ నాగేందర్, జీఎం మహేందర్ నాయక్ తదితరులకు వివరించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ తెలంగాణ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుండగా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి గృహనిర్బంధం చేసినట్లు తెలిపారు. కాలనీవాసుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణికి వెళ్లనివ్వాలని పోలీసులను కోరినా వారు వినకపోవడంతో, చివరకు పోలీసులను వెంట పెట్టుకుని స్వయంగా జలమండలి కార్యాలయం, జోనల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి సమస్యలను వివరించినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గబోనని, ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తానని కొప్పుల నర్సింహ్మా రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో వివిధ కాలనీల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలు కోసమే మా పోరాటం



**ముషీరాబాద్,విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుందని బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ చుక్క గణేష్ ముదిరాజ్ అన్నారు. అరెస్టులు మమ్మల్ని ఆపలేవని మా గళాన్ని ఎవరు మూయలేరని భారతీయ జనతా పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజల హక్కుల కోసం మా పోరాటం మరింత బలంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బిజెపి రాష్ట్ర పిలుపుమేరకు సోమవారం చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు వారిని అడ్డుకొని ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ప్రజల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాల్సిన ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను అణిచి వేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రశ్నించే స్వరాలను అణచివేస్తూ ప్రభుత్వం తన వైఫల్యాలను దాచాలని చూస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ప్రజలను ఏకం చేసి బరాబర్ గా అసెంబ్లీ ముట్టడి తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, శారదా మల్లేష్, దత్తు, ఆనంద్, అంబాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# యువత భగత్ సింగ్ బాటలో ప్రయాణించాలి

**చేవెళ్ల కాంగ్రెస్ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్**

**మొయినాబాద్, విశాలభారతి:** భారతదేశ స్వేచ్ఛ స్వాతంత్రల కోసం అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అతిపిన్న వయస్సులో గడగడలాడించిన విప్లవ వీర కిశోరం షాహిద్ భగత్ సింగ్ బాటలో యువత ప్రయాణించాలని, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు సుకదేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా మొయినాబాద్ మండల పరిధిలోని తోల్కట్ట గ్రామంలోని భగత్ సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భానూరి శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ఎందరో మహానుభావులు స్వాతంత్ర ఉద్యమంలో తమ ప్రాణాలను అర్పించి. దేశానికి స్వేచ్ఛ స్వాతంత్రాలను తీసుకువస్తే స్వదేశీ పాలకులు దోపిడిదారులుగా మారి ప్రజలను అనేక రకాలుగా దోచుకోవడం జరుగుతుందని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు సైతం స్వేచ్ఛ అందించేందుకు వారు చేసే త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. భగత్ సింగ్ కలలుగన్న సమాజం, కుల,మత భేదాలు పేద, ధనిక లేని అవినీతి రహిత సమాజ నిర్మాణం నేటికి సాధించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నేటి యువత ఆ దిశగా పయనించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వంటి సామాజిక విపత్తులకు దూరంగా ఉండి క్రీడాలకు దగ్గర అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోల్కట్ట మాజీ సర్పంచ్ బి.సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఎండీ.ఇనాయత్, వార్డు సభ్యులు ఈ.కుమార్, కే.నవీన్, కే.రమేష్, భగత్ సింగ్ యూత్ సంఘం నాయకులు చాకలి రవీందర్, మొండ్ర శ్రీకాంత్, చాకలి యాదగిరి, ఉమ్మర్ ఖాన్, శ్రీకాంత్ గౌడ్, ఆనంద్, కుమ్మరి విష్ణు, ఇంద్రసేన, కృష్ణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగాసత్తి యాడి దేవత వేడుకలు



**నల్లబెల్లి, విశాలభారతి:** నల్లబెల్లి మండలం మేడపల్లిలో సత్తి యాడి దేవత వేడుకలను డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22 గ్రామాల భక్తులు ఊరేగింపుగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లంబాడీ దేవుళ్ల ఆచారాలు, సంప్రదాయాలు కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. బంజారా సమాజం ఐక్యంగా ఈ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సత్తి యాడి పరిసర ప్రాంతాల్లో రహదారుల లేమితో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కనీస మౌలిక వసతులు లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సత్తి యాడి దేవత వేడుకలకు అధికారిక గుర్తింపు ఇవ్వాలని కోరారు.ఈ వేడుకల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిశాయి.

# ఎన్పీడీసీఎల్ కు గవర్నెన్స్ నౌ 12వ పీఎస్ యూ ఎక్సలెన్స్ అవార్డ్



**హనుమకొండ, విశాలభారతి:** ఆపరేషనల్ ఎక్సలెన్స్, ఆటోమేషన్ డిజిటల్ టెక్నాలజీలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఎన్పీడీసీఎల్ కు గవర్నెన్స్ నౌ 12వ పీఎస్ యూ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ వచ్చినట్లు ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఇటీవల న్యూ ఢిల్లీ లో కంపెనీ తరపున అందుకున్న కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం సోమవారం డైరెక్టర్లు సి.ఈ ల సమక్షంలో హన్మకొండ, నక్కలగుట్ట, విద్యుత్ భవన్లో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ తమ సంస్థలోని ప్రతి ఒక్క ఉద్యోగి శ్రమ , పట్టుదల , తపనకు ఈ అవార్డు దక్కిందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. వినియోగదారులకు అందించే సేవలలో వినూత్న సాంకేతికత పద్దతులకు గాను ఈ అవార్డు దక్కిందన్నారు. ఎన్పీడీసీఎల్ కు రావడం చాల గర్వంగా ఉందని, ఎన్పీడీసీఎల్ లో పనిచేసే ప్రతి ఉద్యోగి శ్రమ , పట్టుదల , తపన వినియోగదారులకు సేవ చేసే సంకల్పం వలన ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు. ఇప్పాయి పవర్ అవార్డ్స్ 2026 ఇన్నోవేషన్ విభాగంలో ఎన్పీడీసీఎల్ కు పురస్కారం లభించిందని తెలిపారు. విద్యుత్ పంపిణీ రంగంలో అమలు చేసిన వినూత్న కార్యక్రమాలకు ఇప్పయి పవర్ అవార్డ్స్ 2026లో ఇన్నోవేషన్ విభాగంలో అవార్డు అందుకుందని పేర్కొన్నారు. ఈ అవార్డు సంస్థ చేపట్టిన ఆధునిక సాంకేతికను అవలంభిస్తూ చేపట్టిన సమస్యల పరిష్కారాలను గుర్తిస్తూ వచ్చిందన్నారు. ఏఐ ఆధారిత ఫీడర్ అవుటేజ్ అంచనా విధానంతో ఫీడర్ రిస్క్ ప్రిడిక్షన్, అవుటేజ్ ఫోర్‌కాస్టింగ్ మోడల్‌ను అభివృద్ధి చేశారని , ఈ మోడల్ ఫీడర్‌కు సంబంధించిన ఫిర్యాదులు, నిర్వహణ రికార్డులు, అంతరాయాల చరిత్ర, వాతావరణ పరిస్థితులను విశ్లేషించి రిస్క్ స్కోర్‌ను రూపొందిస్తుందని తెలిపారు

# గ్రామానికి కొత్త విద్యుత్ సౌకర్యాలు

**డీ.ఈ. హార్జీ శాంక్షన్‌కు హామీ**

**నల్లబెల్లి , విశాలభారతి:** గ్రామంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్త పోల్స్ ఏర్పాటు చేయడం, కొత్త కేబుల్ లైన్ వేయడం అత్యవసరమని చెబుతూ సర్పంచ్ సపావట్ కవిత దేవు నాయక్ ఎంపీడీసీఎల్ కన్స్ట్రక్షన్ డి ఈ వరంగల్‌కి వినతి పత్రం అందజేశారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వివరించి, త్వరితగతిన శాంక్షన్ చేయాలని కోరారు. వినతిని స్వీకరించిన డి ఈ జాటోతు హార్జీ అవసరమైన శాంక్షన్ త్వరలోనే చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విశాల భారతి





# ఒంటరిగా కూర్చుని ఏడ్చేదాన్ని

రీర్ ప్రారంభంలో కథానాయిక శ్రీలీలను ట్రోలింగ్స్ చాలా ఇబ్బంది పెట్టాయట. ఈ కారణంగా ఓ దశలో ఆమె కన్నీటి పర్యంతం అయ్యిందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించింది శ్రీలీల. 'నేను చాలా సెన్సిటీవ్. అందుకే కెరీర్ తొలినాళ్లలో నాపై వచ్చిన ట్రోల్స్ చూసి తట్టుకోలేకపోయాను. ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఓ దశలో అవి శృతిమించడంతో నా మనసంతా నిరాశ అలముకుంది.రీర్ ప్రారంభంలో కథానాయిక శ్రీలీలను ట్రోలింగ్స్ చాలా ఇబ్బంది పెట్టాయట. ఈ కారణంగా ఓ దశలో ఆమె కన్నీటి పర్యంతం అయ్యిందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించింది శ్రీలీల. 'నేను చాలా సెన్సిటీవ్. అందుకే కెరీర్ తొలినాళ్లలో నాపై వచ్చిన ట్రోల్స్ చూసి తట్టుకోలేకపోయాను. ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఓ దశలో అవి శృతిమించడంతో నా మనసంతా నిరాశ అలముకుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.